
www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 53 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com సోమవారం 08 - 06 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool


భూమి వైపు దూసుకొస్తున్న సౌర తుపాను.. రేపటికి జీ3 హెచ్చరిక జారీ!

## మోదీ ఇచ్చిన వజ్రాన్ని సొంతం చేసుకోలేకపోయిన జిల్ బైడెన్.. ఆత్మకథలో ఆసక్తికర విషయాల వెల్లడి


2లో

- ప్రధాని మోదీ బహూకరించిన ల్యాబ్-గ్రోన్ వజ్రంపై జిల్ బైడెన్ ఆసక్తి
- యూఎస్ నిబంధనల ప్రకారం వజ్రం ప్రభుత్వ సొత్తుగా గుర్తింపు
- మోదీ చెప్పిన ధర కంటే అమెరికా అధికారులు కట్టిన విలువే ఎక్కువ
- ధర భారీగా ఉండటంతో సొంతం చేసుకోలేకపోయిన మాజీ ఫస్ట్ లేడీ
- అధికారిక ఈవెంట్లలో ధరించి, వైట్ హౌస్ వీడాక తిరిగి ప్రభుత్వానికి అప్పగింత

ఢిల్లీ :

భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తనకు బహూకరించిన ఒక అరుదైన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని అనుకున్నానని, కానీ అమెరికా ప్రభుత్వ నిబంధనలు, దాని భారీ విలువల కారణంగా చివరికి దానిని వెనక్కి ఇచ్చేయాల్సి వచ్చిందని అమెరికా మాజీ ఫస్ట్ లేడీ డాక్టర్ జిల్ బైడెన్ వెల్లడించారు. ఈ వారం మార్కెట్లోకి విడుదలైన ఆమె ఆత్మకథ 'వ్యూ ఫ్రమ్ ద ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' పుస్తకంలో వైట్ హౌస్ జీవితం, విదేశీ పర్యటనల్లో వచ్చే బహుమతులపై ఉండే కఠినమైన నిబంధనల గురించి ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

## ఖనిజాన్వేషణలోనూ ఏఐ... రూ.100 కోట్లతో భారత్ భారీ ముందడుగు



- ఖనిజాన్వేషణ కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక కేంద్రం
- బెంగళూరులో ఏర్పాటు చేయనున్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వినియోగం
- భూగర్భంలో దాగి ఉన్న కీలక ఖనిజాల గుర్తింపు లక్ష్యం
- రాబోయే ఐదేళ్లలో 8.5 లక్షల చ.కి.మీ. ప్రాంతంపై విశ్లేషణ

ఢిల్లీ :

భారత ఖనిజాన్వేషణ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్" - మిగతా 2 లో

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు.. కొత్త తేదీ ఇదే!



2లో

- జూన్ 12కు బదులుగా 15న స్కూళ్ల పునఃప్రారంభం
- రెండో శనివారం, ఆదివారం నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపు
- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

## మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

- ఉప్పల్ భగాయత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి
- మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తామని వెల్లడి



హైదరాబాద్ :

: పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ ఎంసీని మూడుగా విభజించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం విభజించామని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఓఆర్ ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ఉన్నారన్న సీఎం, అంతమంది జనాభాకు సదుపాయాలు కల్పించడ మంటే ఆషామాషీ కాదన్నారు. ఉప్పల్ భగాయత్ తో పర్య టించిన సీఎం రేవంత్ రెడ్డి ఎంఎంసీతో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రజల సౌలభ్యం కోసమే ఉప్పల్?లో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**మూసీ ప్రక్షాళన రెండో విడత కార్యచరణ వెంటనే చేపట్టాలి :**

ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్?కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టామన్నారు. బండారు రాజిరెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేద్దామని చెప్పారు. - మిగతా 2 లో



## 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

- హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏజెన్సీని ఏర్పాటు చేశానన్న సీఎం రేవంత్
- బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీవ్ర ఆగ్రహం
- ఇది కాంగ్రెస్ హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమన్న బీజేపీ
- చారిత్రకంగా రేవంత్ వాదనలో నిజం లేదంటున్న నిపుణులు

హైదరాబాద్ :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. - మిగతా 2 లో

## సత్యనారాయణ గారూ... నేడు మనం సిద్ధాంతంలో కలుద్దాం!

- చంద్రబాబును చూడాలన్న కామధేనువులంక పెద్దాయన
- వైరల్ అయిన వీడియోకు సీఎం చంద్రబాబు స్పందన
- సత్యనారాయణ గారూ.. రేపు కలుద్దాం అంటూ ట్వీట్
- సిద్ధాంతం పర్యటనలో పెద్దాయనను కలవనున్న సీఎం
- సామాన్యుడి కోరికపై ముఖ్యమంత్రి తక్షణ స్పందన



అమరావతి :

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడానికి ముందుకొచ్చారు. తనను కలవాలని ఆశగా ఎదురుచూస్తున్న పెద్దాయనను ఉద్దేశించి, "సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శుక్రవారం పోస్ట్ చేశారు. అసలేం జరిగిందంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడితో ఒక యువకుడు మాట్లాడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియోలో, "చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని యువకుడు అడగ్గా, "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేనైతే చూడలేదు" అని పెద్దాయన అమాయకంగా బదులిచ్చారు. "ఆయన్ను కలవాలని ఉందా?" అని అడగ్గా, సత్యనారాయణ గారు ఎంతో ఉత్సాహంగా, చూడాలనే కోరిక ఉందని చెప్పారు. దీంతో ఆ యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట వినగానే సత్యనారాయణ గారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ హృద్యమైన వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, పెద్దాయన కోరికను మన్నిస్తూ నేరుగా ఆయన్నే కలుస్తానని ప్రకటించారు. సిద్ధాంతంలో తన పర్యటన సందర్భంగా సత్యనారాయణ గారిని కలవనున్నట్లు ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒక సామాన్యుడి కోరికకు ముఖ్యమంత్రి ఇంత త్వరగా స్పందించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - మిగతా 2 లో

## టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్ : ఏపీ కోసం రష్యాలో నారా లోకేష్ కీలక భేటీలు



- ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం
- రష్యాలో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు
- సంక్షోభంలోనూ అవకాశాలు సృష్టించడమే నాయకత్వమన్న లోకేష్
- ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారి అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు
- అమరావతి, విశాఖలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం యాండెక్స్ సంస్థతో కీలక చర్చలు
- టీచర్లు లేని వినూత్న 'స్కూల్ 21'ను సందర్శించి, విద్యా విధానాలపై అధ్యయనం

అమరావతి :

"సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం. ఆంధ్రప్రదేశ్ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశాలను సృష్టించేందుకే నేను రష్యాలో పర్యటిస్తున్నాను," అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తన రష్యా పర్యటనలో ఐదో రోజు ఆయన మాస్కోలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెట్టుబడుల ఆకర్షణ, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. - మిగతా 2 లో


2 లో..

## కూటమి ప్రభుత్వానికి ఏపీజేఏసీ హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే!

- ప్రభుత్వ ఉద్యోగుల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- మధ్యంతర భృతి, కొత్త పీఆర్సీ అమలుపై ప్రభుత్వం స్పందించాలని సూచన
- డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమానికి సిద్ధమని ఏపీ జేఏసీ హెచ్చరిక
- ఉద్యమ కార్యాచరణ కోసం 13 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఏపీఎస్ఆర్టీసీ భవిష్యత్తుపై జరగనున్న మరో కీలక సమావేశం

## ఏపీలో రేర్ ఎర్త్ హబ్.. రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

- మాస్కోలో రష్యా రేర్ ఎర్త్ సంస్థ 'గిరెడ్‌మెట్'తో మంత్రి నారా లోకేష్ భేటీ
- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ల తయారీ కేంద్రంపై చర్చలు
- భారత ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లే లక్ష్యంగా ప్రాజెక్టులు
- మాస్కోలోని అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన లోకేష్




అమరావతి :

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. - మిగతా 2 లో

## ఏపీలో '108' సేవలకు కొత్త రూపు




- ఆంధ్రప్రదేశ్‌లో సమూలంగా మారిన 108 అంబులెన్స్ సేవలు
- జూన్ 2025 నుంచి మే 2026 వరకు 7.78 లక్షల అత్యవసర కేసులకు సేవలు
- భవ్య హెల్త్ కేర్‌తో కలిసి అధునాతన టెక్నాలజీ వినియోగం
- 1.13 లక్షల రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స
- లక్షకు పైగా గర్భిణులను ఆసుపత్రులకు సురక్షితంగా తరలింపు

2లో

## హైదరాబాదులో చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం... నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

- నాంపల్లిలో రేపు రాత్రి నుంచి చేప ప్రసాదం పంపిణీ
- తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- నగరంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు
- మృగశిర కార్తె రాత్రి రావడంతో
- ఈసారి రాత్రి 9 గంటలకు ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన
- మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే బత్తిని సోదరుల చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధమైంది. మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆస్తమా రోగులకు అందించే ఈ ప్రసాదం పంపిణీ నేడు (జూన్ 8) రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. మృగశిర కార్తె రాత్రి ప్రవేశిస్తుండటంతో ఈ మార్పు చేసినట్లు - మిగతా 2 లో

# సంపాదకీయం

## నక్సల్ ముక్త్ భారత్‌కు కొత్త సవాళ్లు!

వామపక్ష తీవ్రవాదం నుంచి భారత్‌ను విముక్తం చేసే లక్ష్యాన్ని సాధించినట్టు ఈ ఏడాది మార్చి మాసాంతంలో భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ లక్ష్య పరిపూర్తి అంతర్గత భద్రతా రంగంలో ఒక కీలక విజయం. అయితే భౌతిక ఆవరణంలో నక్సలిజం బలహీనపడుతున్నప్పటికీ, దానికి మద్దతుగా పనిచేసే ఒక అంతర్జాతీయ భావజాల నెట్‌వర్క్ ఇంకా చురుకుగా కొనసాగుతూ, కొత్త కథనాల నిర్మాణంతో నక్సలైట్ ఉద్యమాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. యూరప్, ఉత్తర అమెరికా, ఆసియాలోని కొన్ని దేశాలలో ఉన్న సంస్థలు, ప్రచురణలు, కార్యకర్తల సమూహాలు, సిద్ధాంత వేదికలు కలిసి ఒక సమన్వయ వ్యవస్థగా పనిచేస్తున్నాయి. ఇవి ఆదివాసీలు, కార్మికులు, అట్టడుగువర్గాలపై అణచివేతకు పాల్పడే రాజ్యంగా భారతదేశాన్ని చిత్రీకరించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నాయి. ఆ సంస్థలు, వేదికలు సృష్టిస్తున్న, వెలువరిస్తున్న కథనాలు రాజ్య వ్యవస్థను దోపిడీ యంత్రాంగంగా చూపిస్తూ, సాయుధ పోరాటాన్ని సమర్థించే మావోయిస్టు సిద్ధాంతంతో ముడిపడి ఉన్నాయి. ఆస్ట్రేలియాలోని రెడ్--స్పార్క్, అమెరికాలోని బ్యాన్డ్ థాట్ వంటి కొన్ని అంతర్జాతీయ వేదికలు మావోయిస్టు భావజాలాన్ని బహిరంగంగా ప్రచారం చేస్తున్నాయి. సాయుధ పంథాను సమర్థించే సైద్ధాంతిక పత్రాలతో సహా సీపీఐ (మావోయిస్టు) భావజాలానికి అనుకూలంగా ఉన్న వ్యాసాలు, పుస్తకాలను పునః ప్రచురిస్తున్నాయి. అలాగే, సాయుధ పోరాటాన్ని సమర్థిస్తున్న 'ఇంటర్నేషనల్ కమిటీ టు సపోర్ట్ ది పీపుల్స్ వార్ ఇన్ ఇండియా' నెట్‌వర్క్‌లు అంతర్గత భద్రతకు భారత ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ, సాయుధ ఉద్యమానికి నైతిక మద్దతు సమీకరించే ప్రయత్నం చేస్తున్నాయి. తీవ్రవాద వ్యతిరేక చర్యలలో భాగంగా భారత ప్రభుత్వం సామూహిక హత్యాకాండకు పాల్పడుతున్నదని అవి ఆరోపిస్తున్నాయి. డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ప్రచురణలు ఈ కథనాల వ్యాప్తికి సాధనాలు. భౌతికంగా బలహీనపడిన ఉద్యమాలను భావజాల స్థాయిలో నిలబెట్టేందుకు ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. వంటి భావజాల వేదికలు భారత ప్రభుత్వ అంతర్గత భద్రతా చర్యలను ఒక క్రమ పద్ధతిలో సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్కోణంతో పునర్వ్యాఖ్యానిస్తున్నాయి. రెండో స్థాయి కార్మిక, హక్కుల పరిరక్షణ వేదికల ద్వారా ఆ కథనాలకు విశేష ప్రచారం లభిస్తోంది. ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కన్ఫడరేషన్ (ఐటీయూసీ), వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టీయూ) వంటి అంతర్జాతీయ కార్మిక సంస్థలు భారత కార్మిక సమస్యలపై తరచూ స్పందిస్తుంటాయి. అయితే, భారతదేశంలో వ్యవస్థాగత దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతున్నదనే అభిప్రాయాన్ని అంతర్జాతీయ సమాజంలో కలిగించడమే ఈ నివేదికల లక్ష్యంగా ఉంటోంది. బెల్జియంకు చెందిన  వంటి సంస్థలు కొన్నిసార్లు దేశీయ నిరసనలను విస్తృత ప్రభుత్వ వ్యతిరేక కథనాలతో అనుసంధానిస్తున్నాయి. నక్సల్స్ అనుకూల అంతర్జాతీయ కథనాల సృష్టిలో విద్యావేత్తల, మేధావి వర్గాల ప్రమేయం ప్రముఖంగా ఉంటోంది. బ్రిటన్‌కు చెందిన అల్పా షా, జర్మనీకి చెందిన కాళికా మెహతా తదితర వ్యాఖ్యాతలు భీమా కోరేగావ్ కేసుల వ్యవహారాలను ప్రస్తావిస్తూ వ్యవస్థాగత అణచివేతపై పలు వాదనలను ముందుకు తెచ్చారు. అటువంటి ఘటనలను ఎంపిక చేసుకుని వాటిని ఒకే దృక్కోణంతో విశ్లేషించడం, వివరించడం మేధా నిష్పాక్షికతను తెలియజేస్తుందా? పైగా ఆ పాక్షిక విపులీకరణలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించడం ద్వారా తిరుగుబాటుదారుల లక్ష్యాలకు అనుగుణమైన చిత్రణకే దోహదం చేస్తోంది. మరీ ముఖ్యంగా, 'ఆపరేషన్ కగార్' పై వ్యతిరేకత ఈ వ్యవస్థలో తరచూ కనిపించే అంశం. బ్రిటన్‌లోని విద్యార్థి సంఘాల నుంచి ఫిలిప్పీన్స్, ఆస్ట్రియాలోని కార్యకర్తల బృందాల వరకు అనేక సంస్థలు ఈ కగార్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాయి. ఇది అంతర్గత భద్రతపై భారత ప్రభుత్వ నిర్ణయాలను అంతర్జాతీయీకరించి రాజకీయ అంశంగా మార్చే ప్రయత్నాలను సూచిస్తుంది. భౌగోళికంగా కూడా ఈ కథనాల వ్యాప్తి విస్తృతంగా ఉన్నది. ఫ్రాన్స్, జర్మనీ నుంచి టర్కీ, బ్రిటన్, అమెరికా దాకా ఈ విధమైన ప్రచార, మద్దతు నెట్‌వర్క్‌లు విస్తరించి ఉన్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత, మావోయిస్టు సంఘీభావం పేరిట కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ టర్కీ (మార్క్సిస్ట్-- లెనినిస్ట్) రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మొదలైన విదేశీ రాజకీయ పార్టీలు భారత్ వ్యతిరేక కథనాలకు మద్దతునిస్తున్నాయి. భారత్‌లో మావోయిస్టు సాయుధ పోరాట కార్యకలాపాలకు వాటిల్లిన తీరని నష్టానికి పరిహారంగా ఆ తీవ్రవాద ఉద్యమానికి అంతర్జాతీయంగా సైద్ధాంతిక న్యాయబద్ధత కల్పించడమే ఆ కథనాల వ్యూహాత్మక లక్ష్యం. అభివృద్ధి కార్యకలాపాలను 'కార్పొరేట్ దోపిడీ'గాను, అంతర్గత భద్రతా చర్యలను 'రాజ్యహింస'గాను అవి చిత్రిస్తున్నాయి. దేశీయ వామపక్ష సంఘాలు, విదేశాలలోని భారతీయులతో ముడివడివున్న నెట్‌వర్క్‌లు వామపక్ష తీవ్రవాదానికి అనుకూలంగా పునః క్రియాశీలం చేయడమే వాటి సంకల్పం. ఈ వాస్తవాల దృష్ట్యా ఆ కథనాలకు భారత్ ప్రతిస్పందన సంప్రదాయ భద్రతా చట్రాలను దాటి విస్తరించాలి. ఇప్పటికీ లొంగిపోని తీవ్రవాదుల కదలికలపై నిరంతర నిఘా నిర్వహిస్తూ అంతర్జాతీయంగా వ్యాప్తిలో ఉన్న తప్పుడు కథనాలకు వ్యతిరేకంగా సమాచార సమరాన్ని ముమ్మరం చేయాలి. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి కార్యకలాపాలు సాధిస్తున్న సత్ఫలితాలను అంతర్జాతీయ చర్చా వేదికలపై నివేదించాలి. ప్రజాక్షేత్ర స్థాయిలో మావోయిస్టు హింసాత్మక కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడం ఒక గణనీయమైన విజయం, సందేహం లేదు. అయితే మావోయిస్టుల పోరు వనాల నుంచి వేదికలకు-- సాయుధ పోరాటం నుంచి సమాచార సమరానికి మారింది. ఈ వాస్తవాన్ని గుర్తించి నక్సల్ ముక్త్ భారత్ పూర్వస్థితికి తిరోగమించకుండా సుస్థిరంగా ఉండేందుకు ప్రభుత్వమూ, ప్రజలూ దృఢ సంకల్పం వహించాలి.

## మోదీ ఇచ్చిన వజ్రాన్ని సొంతం చేసుకోలేకపోయిన జిల్ బైడెన్.. ఆత్మకథలో ఆసక్తికర విషయాల వెల్లడి

**మొదటిపేజీ తరువాయి -** 2023 జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయన జిల్ బైడెన్‌కు భారతదేశంలో స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన 7.5 క్యారెట్ల కృత్రిమ వజ్రాన్ని బహుమతిగా ఇచ్చారు. "ఆ వజ్రం చాలా అద్భుతంగా ఉంది. ల్యాబ్-గ్రోన్ వజ్రాల తయారీలో భారత్ సాధించిన ప్రగతికి అది ఒక ప్రతిరూపం. ఆ గిఫ్ట్ నన్ను ఎంతగానో ఆకర్షించింది" అని జిల్ బైడెన్ తన పుస్తకంలో రాసుకొచ్చారు.

### రూల్స్ అడ్డుపడ్డాయి

అమెరికా నైతిక నిబంధనల ప్రకారం వైట్ హౌస్ అధికారిక హోదాలో అందుకునే ఏ బహుమతి అయినా వ్యక్తిగత సొత్తు కాదు, అది అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికే చెందుతుంది. అయితే, సదరు బహుమతిని మార్కెట్ ధర చెల్లించి సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. "ఈ వజ్రం తన సొంత ఊరిలో 2,500 డాలర్ల (దాదాపు రూ. 2 లక్షలు)తో తయారైందని, దానికి సంబంధించిన బిల్లు కూడా ఉందని ప్రధాని మోదీ నాతో చెప్పారు. దాంతో, అంత తక్కువ ధర అయితే నేనే డబ్బులు కట్టి ఆ వజ్రాన్ని కొనేద్దామని అనుకున్నాను" అని జిల్ బైడెన్ పేర్కొన్నారు.కానీ, ఆమె ప్లాన్ కాస్తా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వాల్యుయేషన్‌తో మారిపోయింది. అమెరికా అధికారులు ఆ వజ్రాన్ని పరిశీలించి దాని విలువ ఏకంగా 20,000 డాలర్లు (సుమారు రూ. 16.6 లక్షలు) గా నిర్ధారించారు. మోదీ చెప్పిన ధర కంటే అధికారులు కట్టిన విలువ చాలా ఎక్కువగా ఉండటంతో ఆమె ఆ వజ్రాన్ని సొంతంగా కొనాలనే ఆలోచనను విరమించుకున్నారు. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ఆ వజ్రాన్ని కేవలం అధికారిక వేడుకల కోసం అద్దెకు తీసుకునే  వెసులుబాటు ఉండటంతో.. జిల్ బైడెన్ దాన్ని ఒక ఉంగరంలో చేయించుకుని వైట్ హౌస్ ఈవెంట్లలో ధరించారు. అయితే, బైడెన్ ప్రభుత్వం ముగిసి వైట్ హౌస్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఆ ఉంగరాన్ని తిరిగి ప్రభుత్వ స్టోరేజ్ రూమ్‌కు అప్పగించినట్లు ఆమె తెలిపారు. ఇదే సందర్భంలో ఫ్రెంచ్ ఫస్ట్ లేడీ బ్రిగిట్టే మాక్రాన్ ఇచ్చిన బ్రాస్‌లెట్ ధర తక్కువగా ఉండటంతో తానే సొంత డబ్బులు పెట్టి కొనుక్కున్నానని, ఉక్రెయిన్ ఇచ్చిన ఒక బ్రోచ్ విలువను అధికారులు 14,063 డాలర్లుగా తేల్చారని జిల్ బైడెన్ తన పుస్తకంలో గుర్తు చేసుకున్నారు.

## టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్: ఏపీ కోసం రష్యాలో నారా లోకేష్ కీలక భేటీలు

**మొదటిపేజీ తరువాయి -**

ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశం

మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రవాస భారతీయుల (డయాస్పోరా) సమావేశంలో లోకేష్ ఉద్విగ్నభరితంగా ప్రసంగించారు. "మీరు భారతదేశాన్ని విడిచి వచ్చినా, భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా, మన సంస్కృతి, సంప్రదాయాలను గుండెల్లో మోస్తున్న మీ విజయాలు దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయి" అని ఆయన ప్రశంసించారు.  భారత్-రష్యా బంధం అత్యంత విశ్వసనీయమైనదని, ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో ఈ స్నేహం మరింత బలపడిందని అన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ దేశ కీర్తిప్రతిష్టలను చారిత్రక శిఖరాలకు చేర్చారని కొనియాడారు.

అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కండి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని లోకేష్ వివరించారు. "యువ జనాభా, సుదీర్ఘ తీరప్రాంతం, ఆధునిక ఓడరేవులు మన బలం. పెట్టుబడులను ఆకర్షించి, వాటిని యువతకు ఉపాధిగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం," అని ఆయన తెలిపారు. గత రెండేళ్లలో ఏపీ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి ఏరోస్పేస్ వరకు అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. "మీరంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఒక్క పెట్టుబడి తీసుకురండి, యువతకు ఉద్యోగాలివ్వండి. మీకు ఏ సమస్య వచ్చినా ఏపీఎన్నార్టీ అండగా ఉంటుంది, ఆ బాధ్యత నాది," అని లోకేష్ భరోసా ఇచ్చారు. బలమైన భారత్ కోసం 'నమో' (నరేంద్ర మోదీ) అయితే, బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం 'నమో' (నాయుడు-మోదీ) కలయిక పనిచేస్తోందని ఆయన అభివర్ణించారు.

అమరావతి, విశాఖకు స్మార్ట్ ట్రాఫిక్ సొబగులు

పర్యటనలో భాగంగా, రష్యాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాండెక్స్ (ఖుఅసవఞ) ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. అమరావతి, విశాఖపట్నం నగరాల్లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, కంప్యూటరైజ్డ్ పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్ అమలుపై చర్చించారు. లాస్ట్-మైల్ రవాణా ఖర్చులను తగ్గించేందుకు యాండెక్స్ అటానమస్ వాహనాలు, ప్రిడిక్టివ్ రూటింగ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు.

### విశాఖ కేంద్రంగా ఫార్మా ఎగుమతులు

విశాఖపట్నాన్ని రష్యా, కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ మార్కెట్లకు ఎగుమతుల హబ్‌గా మార్చడమే లక్ష్యమని లోకేష్ తెలిపారు. మాస్కోలో ఆర్ఎంఎం ఫార్మా డైరెక్టర్ ముఖేష్ కుమార్‌తో భేటీ సందర్భంగా, విశాఖలో ఆ సంస్థ నిర్మిస్తున్న యూనిట్ పనులను వేగవంతం చేయాలని కోరారు. విశాఖలో రూ.200 కోట్ల వ్యయంతో, 300 మందికి ఉపాధి కల్పించేలా తమ యూనిట్ నిర్మాణం జరుగుతోందని, 2027 మార్చి నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తామని ముఖేష్ కుమార్ వివరించారు.

### టీచర్లు లేని 'స్కూల్ 21' పై ఆసక్తి

ఈ పర్యటనలో మరో ముఖ్యమైన ఘట్టం, మాస్కోలోని వినూత్న పాఠశాల 'స్కూల్ 21'ను సందర్శించడం. స్బేర్ బ్యాంక్ ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక తరగతులు ఉండవు. విద్యార్థులు ప్రాజెక్ట్ ఆధారిత పనుల ద్వారా ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటారు. ఇక్కడ ప్రవేశానికి గత విద్యార్హతలతో సంబంధం లేకుండా, సమస్య పరిష్కార నైపుణ్యాల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ విద్యా విధానంపై లోకేష్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. నిర్వాహకులు, విద్యార్థులతో మాట్లాడి, అక్కడి పద్ధతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఏపీలో విద్యా సంస్కరణలకు ఈ మోడల్ ఎంతవరకు ఉపయోగపడుతుందనే కోణంలో అధ్యయనం చేశారు. మొత్తం మీద, మంత్రి లోకేష్ రష్యా పర్యటన కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, విద్య, సాంకేతికత, నగరాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నూతన భాగస్వామ్యాలను నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ చిత్రపటాన్ని మార్చే దిశగా సాగుతోంది. ఈ సమావేశంలో లోకేష్ వెంట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, మాస్కోలోని భారత రాయబారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఏపీలో '108' సేవలకు కొత్త రూపు

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లో 108 అంబులెన్స్ సేవలను ప్రభుత్వం సమూలంగా ఆధునికీకరించి, లక్షలాది మందికి అత్యవసర సమయాల్లో ప్రాణదాతగా నిలుపుతోంది. "ప్రాణం కాపాడటంలో ప్రతి సెకను విలువైంది" అనే నినాదంతో పనిచేస్తూ, గత ఏడాది కాలంలోనే దాదాపు 7.78 లక్షల మందికి అత్యవసర సేవలు అందించినట్లు ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. భవ్య హెల్త్ కేర్ భాగస్వామ్యంతో సంకీర్ణ ప్రభుత్వం ఈ సేవలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దింది. అధునాతన జీపీఎస్ ట్రాకింగ్, రియల్-టైమ్ ట్రాఫిక్ రూటింగ్, డిజిటల్ పేషెంట్ లాగ్స్ వంటి టెక్నాలజీని జోడించి, ప్రమాదం జరిగిన తర్వాత అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్'లో బాధితులకు సత్వర చికిత్స అందేలా చర్యలు తీసుకుంది.  2025 జూన్ నుంచి 2026 మే మధ్య కాలంలో 108 బృందాలు మొత్తం 7,78,799 ఎమర్జెన్సీ కాల్స్‌కు స్పందించాయి. ఇందులో 1,13,764 రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన చోటే స్థిరమైన చికిత్స అందించారు. అదేవిధంగా, గ్రామీణ ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ, 1,05,786 మంది గర్భిణులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించారు. ఇది మాతాశిశు మరణాల రేటును తగ్గించడంలో గణనీయంగా దోహదపడింది. ఇక ఇతర కేసుల వివరాలు చూస్తే, శ్వాసకోశ సమస్యలతో 97,118 మందికి, గుండె సంబంధిత సమస్యలతో 45,951 మందికి, పక్షవాతంతో బాధపడుతున్న 20,278 మందికి తక్షణ వైద్య సహాయం అందించారు. అంబులెన్సులలో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్) సిస్టమ్స్, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది.

## ఏపీలో రేర్ ఎర్త్ హబ్.. రష్యా సంస్థతో మాస్కోలో మంత్రి లోకేష్ కీలక భేటీ

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభించే భారీ ఖనిజ వనరులను ఉపయోగించుకుని, ఒక డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. అలాగే, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ ఉ రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు, నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు భాగస్వామ్యం వహించాలని కోరాను" అని తెలిపారు. మాస్కోలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియాన్ని కూడా లోకేష్ సందర్శించారు. ఈ పర్యటన తనకు ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందని, విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా ఈ మ్యూజియం నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

## ఖనిజాన్వేషణలోనూ ఏఐ... రూ.100 కోట్లతో భారత్ భారీ ముందడుగు

**మొదటిపేజీ తరువాయి -** (డీపీఐఐసీ)ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నెలకొల్పనుంది. ఈ కేంద్రం దశాబ్దాలుగా సేకరించిన భూగర్భ, భౌగోళిక, రసాయన, ఉపగ్రహ డేటాను విశ్లేషించడానికి ఒక ప్రధాన హబ్‌గా పనిచేస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఖనిజాలు లభించే అధిక సంభావ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక మ్యాపులను రూపొందిస్తుంది. దీనివల్ల సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు నష్టభయం కూడా తగ్గుతుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 8.5 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఖనిజ సంభావ్యతపై ఈ కేంద్రం విశ్లేషణ చేయనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అవసరమైన కీలక ఖనిజాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఈ అత్యాధునిక కేంద్రం ఏర్పాటు ప్రణాళికలు కొంతకాలంగా కొనసాగుతుండగా, జూన్ 7న దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడింది. ఈ పరిణామం ఖనిజ భద్రత కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని, ఇది దేశ ఖనిజాన్వేషణలో ఒక గేమ్-ఛేంజర్‌గా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు.. కొత్త తేదీ ఇదే!

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థులకు, తల్లిదండ్రులకు కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. పాఠశాలలకు ప్రకటించిన వేసవి సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ముందుగా జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉండగా, తాజాగా ఆ తేదీని జూన్ 15కు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. జూన్ 13 రెండో శనివారం, జూన్ 14 ఆదివారం కావడంతో కేవలం ఒక్క రోజు (జూన్ 12, శుక్రవారం) కోసం పాఠశాలలు తెరిచి, మళ్లీ రెండు రోజులు సెలవులు ఇవ్వడంపై గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పునఃప్రారంభ తేదీని పునఃపరిశీలించాలని ప్రభుత్వం వద్దకు పలు అభ్యర్థనలు వచ్చాయి. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సెలవులను పొడిగించడమే సరైనదని భావించింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 15వ తేదీ సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయని విద్యాశాఖ స్పష్టం చేసింది.

## హైదరాబాదులో చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం... నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి -** నిర్వాహకులు తెలిపారు. జూన్ 9వ తేదీ రాత్రి వరకు ఈ పంపిణీ నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్వయంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లు, కూలర్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, సీపీఆర్ బృందాలను సిద్ధంగా ఉంచారు. భద్రత కోసం పోలీసులు, షీ టీమ్స్, సీసీటీవీలతో నిఘా ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం పంపిణీ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు జూన్ 8 ఉదయం 6 గంటల నుంచి జూన్ 9 రాత్రి 8 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఆర్టీసీ బస్సులు, వ్యాన్లలో వచ్చేవారు గాంధీభవన్ లేదా గృహకల్ప వద్ద, ఆటోల్లో వచ్చేవారు షెజాన్ హోటల్ వద్ద దిగి గ్రౌండ్స్‌కు చేరుకోవాలి. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

## 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

**మొదటిపేజీ తరువాయి -** చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై హైడ్రా ఏజెన్సీ తీసుకుంటున్న కఠిన చర్యలను సమర్థించుకుంటూ రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైడ్రా అనే పదం హిట్లర్‌కు చాలా ఇష్టమైనది. ఆయన కోర్ టీమ్‌ను హైడ్రా అని పిలిచేవారు, వారు ఎవరినైనా హతమార్చగలరు. అందుకే నేను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది దీనికి హైడ్రా అని పేరు పెట్టాను" అని ఆయన వివరించారు. అయితే, రేవంత్ రెడ్డి వాదనలో చారిత్రక నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్‌కు 'హైడ్రా' పేరుతో ఎలాంటి హంతక బృందం లేదని, వాస్తవానికి నాజీ జర్మనీపై బ్రిటన్ వైమానిక దళం జరిపిన బాంబు దాడి ఆపరేషన్‌కు ఆ పేరుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది కాంగ్రెస్ పార్టీ 'హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి' నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. దీన్ని 'తానాషాహి' (నియంతృత్వం) అని అభివర్ణించారు. గతంలో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ, ఇది కాంగ్రెస్ నైజమని విమర్శించారు. అటు బీఆర్ఎస్ పార్టీ కూడా రేవంత్ వ్యాఖ్యలను ఖండించింది. సోషల్ మీడియాలో సైతం ఈ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం.. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు

**ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు**

**నాయకుల మధ్య విభేదాలు, క్రమశిక్షణ లోపించడమే కారణం**


**ఈ మేరకు నిర్ణయం తీసుకున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్**

**ప్రకాశం జిల్లా తర్వాత నెల్లూరు కమిటీపై వేటు**

**కొత్త కమిటీ నియామకం వరకు కేంద్ర కార్యాలయం పర్యవేక్షణ**

జనసేన పార్టీలో ప్రక్షాళన దిశగా అధినేత పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. "క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని పవన్ వివరించారు. కొద్ది రోజుల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే తరహా చర్యను ఇప్పుడు నెల్లూరు జిల్లా విషయంలోనూ తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో జిల్లా సమన్వయ బాధ్యతలు చూస్తున్న వారితో సహా కమిటీల్లోని సభ్యులందరూ తమ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లయింది. కొత్త కమిటీని నియమించేంత వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తామని జనసేన స్పష్టం చేసింది.

## మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



**మొదటిపేజీ తరువాయి -** గుజరాత్ లో సబర్మతి రివర్?ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు, ఢిల్లీలో యమునా రివర్?ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని యోగి ఆదిత్యనాద్ చెప్పుకున్నారన్నారని గుర్తుచేశారు. మా మోదీ నదులను ప్రక్షాళన చేశారని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారని, మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారని ఆక్షేపించారు. ఉప్పల్, నల్గొండ ప్రజలు మూసీ మురికితో ఇబ్బంది పడుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన రెండో విడత కార్యాచరణ వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## కూటమి ప్రభుత్వానికి ఏపీజేఏసీ హెచ్చరిక.. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే!




**మొదటిపేజీ తరువాయి -** ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణకు దిగుతామని ఏపీజేఏసీ అమరావతి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విజయవాడలో ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 28 జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన కరవు భత్యం (డీఏ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, కొత్త వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ను అమలు చేయాలని నాయకులు ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశాలపై త్వరగా స్పందించకపోతే ఉద్యమించడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం 13 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సోమవారం (జూన్ 8) నుంచి తన కార్యాచరణను ప్రారంభిస్తుందని వెల్లడించారు. తమ పోరాటానికి ఇతర ఉద్యోగ సంఘాల నుంచి మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక అంశాలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా, ఏపీఎస్ఆర్టీసీ భవిష్యత్తు కార్యాచరణపై సోమవారం మరో ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు నాయకులు తెలిపారు.

## భారత్‌లో కొత్త జీవి.. శత్రువులను చూసి అలారం మోగిస్తుంది!



భారత జీవవైవిధ్యంలో మరో అరుదైన జీవి వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్ లోని అడవుల్లో శాస్త్రవేత్తలు సరికొత్త జాతి చెద పురుగును కనుగొన్నారు. దీని ప్రత్యేకత ఏంటంటే.. శత్రువుల నుంచి రక్షించుకోవడానికి తన దవడలతో 'టిక్ టిక్' మని శబ్దం చేసి తోటివాటిని అప్రమత్తం చేస్తుంది. ఈ ప్రత్యేక లక్షణం కారణంగా ఇది శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. ఈ కొత్త జాతి చెదపురుగుకు 'సూడోకాప్రిటెర్మస్ నోవస్' అని పేరు పెట్టారు. దీని సైనికుల దవడలు వంకరగా, అసమ నిర్మాణంతో ఉంటాయి. ప్రమాదం ఎదురైనప్పుడు ఈ దవడలను ఒకదానికొకటి వేగంగా కొట్టుకోవడం ద్వారా అలారం లాంటి శబ్దాన్ని సృష్టిస్తాయి. ఇది రక్షణకు లేదా తమ సమూహానికి సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. సాధారణంగా చెదపురుగులు అంటే ఇళ్లలోని ఫర్నిచర్‌ను, కలపను నాశనం చేసేవిగా మనకు తెలుసు. కానీ, ఈ కొత్తరకం చెదపురుగులు అందుకు పూర్తి భిన్నం. ఇవి మానవాళికి మేలు చేసేవి. నేలలో ఉండే కుళ్లిన ఆకులు, సేంద్రియ పదార్థాలను తిని జీవిస్తాయి. తద్వారా నేల సారాన్ని పెంచి, పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తాయి. ఆరోగ్యకరమైన అటవీ ప్రాంతాలకు ఇవి సూచికగా నిలుస్తాయి. పశ్చిమ బెంగాల్‌లోని చప్రామరి వన్యప్రాణుల అభయారణ్యంలో కూలిన సాల వృక్షం దుంగ కింద మట్టిలో వీటిని గుర్తించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కలకత్తా యూనివర్సిటీ పరిశోధకులు కలిసి ఈ ఆవిష్కరణ చేశారు. మైక్రోస్కోపిక్ పరిశీలన, డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇది కొత్త జాతి అని నిర్ధారించారు. భారత్‌లో ఈ ప్రజాతికి చెందిన చెదపురుగుల్లో ఇది ఐదవది. ఈ ఆవిష్కరణ మన దేశంలోని అభయారణ్యాల్లో ఇంకా కనుగొనని ఎన్నో జీవ జాతులు ఉన్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.


www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా


## సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి - ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**గిద్దలూరు,జూన్ 07.అక్షర టైమ్స్:-** గిద్దలూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు , కార్యకర్తలకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించే సమావేశం శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూలస్తంభమని,18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, మరణించిన వారి పేర్ల తొలగింపు, డూప్లికేట్ నమోదుల నిర్మూలన, చిరునామా మార్పులు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. బూత్ కన్వీనర్లు బి ఎల్ వో లు ప్రతి ఇంటిని సందర్శించి కొత్త ఓటర్లను గుర్తించడం, పేర్లలోని తప్పులను సరిచేయించడం, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలను నవీకరించడం, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ తరువాత డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ రాజకీయాలకు అతీతమైన జాతీయ బాధ్యత అని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, బి ఎల్ ఓ లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం కోసం బీసీలు ఏకమై అధికారం సాధిద్దాం

**ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి : బీసీ ఐక్యవేదిక డిమాండ్**



**శేరిలింగంపల్లి,జూన్07.అక్షర టైమ్స్:-ప్రతినిధి** బీ.సీ.కులాల,బీ.సీ.సంఘాల తెలంగాణ రాష్ట్ర ఐక్య వేదిక కార్యవర్గ సమావేశం రాష్ట్ర కార్యాలయం శేరిలింగంపల్లి నేతాజీ నగర్ గుల్మోహార్ పార్క్ లో రాష్ట్ర అధ్యక్షులు బేరి రామ్ చంద్రయాదవ్ అధ్యక్షతన జరిగింది.కార్యవర్గంలో ఇంకొంతమంది ముఖ్యులను చేర్చుకొని ఐక్య వేదిక బలోపేతంగా తయారుచేసి రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక న్యాయం కొరకు పోరాటాలు చేసి బీసీలకు ఆర్థిక సామాజిక విద్యా వైద్యం అన్ని రంగాల్లో న్యాయం కోసం బీసీలు ఏకమై అధికారం సాధిద్దామని బేరి రామ్ చంద్రయాదవ్ పిలుపునిచ్చారు. ఆశయం, పెద్దలు , యువత అనేక మంది ప్రసంగిస్తూ న్యాయ పోరాటానికి సిద్ధం అని మద్దతు పలికారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రానికి బీసీ సీఎం అయ్యేవరకు పోరాటం చేస్తామని ఆర్థిక సామాజిక విద్యా వైద్యం అన్నింట బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఈ ఉద్యమంలో భాగస్వాములై మీరందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునివ్వడం జరిగింది తెలంగాణ రాష్ట్రం నీళ్లు నిధులు నియామకాల కోసం జరిగిన పోరాటంలో తెలంగాణ సాధించినను సామాజిక న్యాయం ఇంతవరకు లేదు. నిరుపేదలు పేదలుగానే ఉన్నారు అగ్రవర్ణాల వాళ్లే ఏలుచున్నారు కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా కామారెడ్డి డిక్లరేషన్ 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని ఇవ్వలేదు అందుకని న్యాయపోరాటం తప్పదు ప్రతి ఒక్కరు కూడా ఈ బిసి ఉద్యమం న్యాయం కోసం పోరాటంలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది విద్య ఉద్యోగం ఉపాధి వైద్యం అన్నింట న్యాయం జరిగే వరకూ పోరాడుదామని తెలుపడం జరిగింది. బీసీలకు బడ్జెట్లో మేమెంతో మాకంతబడ్జెట్ కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. తెలంగాణలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.సంగారెడ్డి బీ.సీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఓ.నర్సింహులు, సంగారెడ్డి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఐలేష్ యాదవ్, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి, రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, పెద్దలు వెంకటేశ్వర్లు, జిన్నారం మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బిసి ఐక్యవేదిక ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్, బహుజన జే.ఏ.సీ వైస్ చైర్మన్ నర్సింగ్ రావు మిగతా ముఖ్యులు ప్రసంగించడం జరిగింది. ముఖ్య సలహాదారు ఆర్కే సాయన్న ముదిరాజ్ మాట్లాడుతూ కార్యవర్గంలో కొంతమంది ముఖ్యమైన వారిని చేర్చుకొని పాత పది జిల్లాల్లో బీసీ ఐక్యవేదిక కార్యవర్గాలు ఏర్పాటు చేసి పోరాటం చేద్దామని సామాజిక ఆర్థిక మరియు అన్ని రంగాల్లో బీసీలు అభివృద్ధి చెందే విధంగా ఉద్యమిద్దామని పిలుపునివ్వడం జరిగింది.కార్యవర్గ సమావేశంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు సంగారెడ్డి జిల్లా బిసి అధ్యక్షులు నర్సింలు యాదవ సంఘం అధ్యక్షులు ఐలేష్ యాదవ్ యువజన సంఘం అధ్యక్షులు కుమార్ యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ బహుజన చేసి వైస్ చైర్మన్ నర్సింగ్ రావు నాన్నకు రామ్ గూడ సురేష్ కుమార్, జిన్నారం నర్సింగ్ ముదిరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు మున్నూరు కాపు సంఘం సందీప్ మనోజ్ ముదిరాజ్ మల్లేష్ ముదిరాజ్, శేరిలింగంపల్లినాయి బ్రాహ్మణ అధ్యక్షులు సంఘం తెలుగు యువత తదితరులు పాల్గొని నర్సింగరావు పాటతో మరియు వందన సమర్పణతో కార్యవర్గ సమావేశం ముగిసింది.

## సబ్ జైల్ ని సందర్శించిన న్యాయమూర్తి భరత్ చంద్ర



**గిద్దలూరు,జూన్ 07.అక్షర టైమ్స్ :-** మార్కాపురం జిల్లా, గిద్దలూరు సబ్ జైల్ ని ఆదివారం ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా గిద్దలూరు న్యాయమూర్తి భరత్ చంద్ర సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. తరువాత ఆహార నాణ్యతను కూడా పరిశీలించారు. అంతేకాకుండా ఖైదీలతో కలిసి న్యాయమూర్తి ఆహారం తిన్నారు. తిన్న తర్వాత ఆహారం నాణ్యత పై సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకుని న్యాయ సహాయం అందిస్తామని వారికి తెలిపారు. అలానే నేర ప్రవృత్తిని సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు న్యాయమూర్తి భరత్ చంద్ర కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైల శాఖ అధికారులతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

## కంబం చెరువు కట్టను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ మరియు గిద్దలూరు ఎమ్మెల్యే



**కంభం,జూన్ 07.అక్షరటైమ్స్:-** అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 సందర్భంగా నిర్వహించనున్న "యోగాంధ్ర 2026" ఏర్పాట్లను కంబం చెరువు కట్ట పై యోగాంధ్ర జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జిల్లా యంత్రాంగం పరిశీలించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ యోగా కార్యక్రమంలో భాగంగా కంబం చెరువు కట్టను ప్రధాన వేదికగా ఎంపిక చేసిన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పాల్గొననున్న యోగా సాధకులకు అవసరమైన వసతులు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగా సాధనను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "యోగాంధ్ర 2026" కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్,ఎమ్మెల్యే , ఆర్డీవోకి కంబం మండల నాయకులు, స్థానిక నాయకులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## శేరిలింగంపల్లి అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలి - చిర్రా రవీందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,జూన్07.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొత్త హామీలు ఇవ్వడానికి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా గుర్తింపు పొందిందన్నారు. ఐటీ రంగ విస్తరణ, ఫ్లైఓవర్లు, రోడ్ల అభివృద్ధి, మిషన్ భగీరథ, నిరంతర విద్యుత్ సరఫరా వంటి కార్యక్రమాల్తో శేరిలింగంపల్లి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలా కాలం గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిస్థాయి పురోగతి కనిపించడం లేదన్నారు. మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.నియోజకవర్గ ప్రధాన సమస్యలు - పెండింగ్ పనులుశేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, మౌలిక వసతుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలు, రోడ్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయకుండా కొత్త శంకుస్థాపనలు చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని పేర్కొన్నారు.అరికేపూడి గాంధీ రాజకీయ వైఖరిపై డిమాండ్అలాగే శేరిలింగంపల్లి రాజకీయాల గురించి మాట్లాడే ముందు స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా అరికేపూడి గాంధీ ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలో ఉన్నారో, ఆయన రాజకీయ వైఖరి ఏమిటో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పార్టీ మార్పులు, రాజకీయ అవకాశవాదం గురించి మాట్లాడే నాయకులు ముందుగా తమ వైఖరిని ప్రజల ముందు స్పష్టంగా ఉంచాలని అన్నారు."శేరిలింగంపల్లి ప్రజలు రాజకీయ ప్రసంగాల కోసం కాకుండా అభివృద్ధి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వాలి. ప్రజలకు జవాబు చెప్పాల్సిన సమయం వచ్చింది. శంకుస్థాపనల కంటే హామీల అమలే ముఖ్యమని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలి."

## కోరు..కొబ్బరి మేలు అందాల వృక్షం



డా. ఎమ్. సుభాష్ చంద్ర, M.B.B.S

ఆకాశాన్ని తాకే ఎత్తైన రూపం.ఆరోగ్యానికి ఆలవాలం,ఔషధ గుణాల నిలయం..ఇలలో- ఈ కల్పవృక్షం..ఉపయోగం ఉన్నంతకాలం.. ఊపిరి పోసే వరం.!ఎందుకంటే దీని నీరుఅమూల్యమైన పోషకాహారం.ఏ కాలమైనా, ఏ వేళైనామనకు తోడుగా నిలిచేది..ఒక ప్రక్క ఆరోగ్యం,మరో ప్రక్క ఆదాయం..ఓర్పుతో వినియోగిస్తేఈనెలు, తాళ్లు,ఎన్నో ఉపయోగాలు. .ఔరా.. అనిపించే అద్భుతం.!కోరు... కొబ్బరి మేలు.. ప్రకృతి ప్రసాదం.డా"ఎమ్.సుభాష్ చంద్ర ఎంబిబిఎస్

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన సదస్సు

**ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**





**కావలి,జూన్07.అక్షర టైమ్స్:-** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్) పై ప్రజల్లో, పార్టీ నాయకుల్లో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్ రెడ్డి కళ్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, కావలి నియోజకవర్గ పరిశీలకులు జయంతి బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, తప్పుల సవరణ, చిరునామా మార్పులు వంటి అంశాలపై నాయకులకు వివరణ ఇచ్చారు.త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని నాయకులకు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో కావలి నియోజకవర్గ పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ , బూత్ కన్వీనర్, బూత్ కో కన్వీనర్, యూనిట్, కో యూనిట్, క్లస్టర్, కో క్లస్టర్లు, ప్రధాన కార్యదర్శిలు, వార్డు, గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్, సెక్రటరీ మరియు ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

## సంబరాల సాక్షిగా సిల్వర్ ఓక్.. కుటుంబ బంధాలకు కొత్త ఊపిరి

**వేసవి సంబరాల్లో సందడి చేసిన కుటుంబాలు**





**చర్లపల్లి,జూన్07.అక్షర టైమ్స్:-** సిల్వర్ ఓక్ బంగ్లాల్లో ఘనంగా సమ్మర్ ఉత్సవం -- ముఖ్య అతిథిగా బొంతు శ్రీదేవి యాదవ్సిల్వర్ ఓక్ బంగ్లాల్లో నిర్వహించిన వేసవి ఉత్సవం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, కుటుంబ సభ్యులు, పిల్లలు, పెద్దలు కలిసి ఆనందంగా గడిపే ఇటువంటి కార్యక్రమాలు సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, ఆప్యాయతలను పెంపొందించే ఇలాంటి వేడుకలు ప్రతి కాలనీలో నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.వేసవి ఉత్సవంలో చిన్నారుల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం కాలనీవాసులకు చిరస్మరణీయ అనుభూతిని అందించిందని నిర్వాహకులు తెలిపారు.ఈ వేడుకలో సిల్వర్ ఓక్ బంగ్లాస్ అధ్యక్షుడు గోపీ చెన్నం, కార్యదర్శి హరికృష్ణ, కోశాధికారి శ్రీనివాస్, ప్రసాద్, సునీల్ కుమార్, రమేష్ చందా, రమణ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కావలి ఎమ్మెల్యే కావ్యపై ఘాటైన మాటలతో దాడి చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

**నివు తిన్న ఆ 100 కోట్లు మనిస్కం ఏమైంది.?**

**126 ఎకరాల సంగతి తేల్చు.?**

**నీ కాళ్ళు కడిగి శభాష్ ఎమ్మెల్యే అంటాను**

**లోకేష్ కే 90వేలు వచాయి, నీకు 30వేలు రావడం గొప్ప ఏమి కాదు**

**మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వాయిస్**



**కావలి,జూన్07.అక్షర టైమ్స్:-** కావలిలో జరిగిన మనీ స్కాం లో నీవు తిన్నటువంటి 100 కోట్ల రూపాయలు ఏమయ్యాయి.., అలాగే 126 ఎకరాలు కబ్జాకు గురైంది అని చెబుతూ వచ్చావు కదా.., వాటి విషయం ప్రస్తుతం ఏమి తేల్చావు..? అంటూ కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పై ధ్వజమెత్తారు. కావలి రాజకీయాల్లో అధికార ప్రతిపక్షాల మధ్య ఘాటైన మాటల యుద్ధాలు మొదలైంది అని తెలుస్తుంది. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి దమ్ముంటే మని స్కీం నుంచి నివు తిన్న 100 కోట్లు రూపాయలు, అలాగే కబ్జాకు గురైన 126 ఎకరాల భూమిపై తేల్చాల్సిన అంశాన్ని ఎందుకు మరుగు చేశావు అంటూ కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పై విరుచుకుపడ్డారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ప్రతాప్ కుమార్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 30 వేలతో నీవు కావలిలో గెలవడం గొప్ప ఏమి కాదని, పనికిమాలిన లోకేష్ 90 వేల తో గెలిచాడు కనుక నివు గెలవడంలో గొప్ప ఏమి లేదు అన్నారు. ప్రతి విషయానికి గత ప్రభుత్వంలో వైసిపి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అవినీతి చేశాడు, అమృత పథకం స్కీం ద్వారా 14 కోట్లు డ్రా చేసుకొని తిన్నాడు అని రకరకాల ఆరోపణలు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేశారు కనుక ఈ విధంగా స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. అమృతవం.1 స్కీం ద్వారా ఆనాడు తనకి ఎలాంటి సంబంధం లేకపోయినా, అప్పటి కాంట్రాక్టర్ కె.వి.ఆర్ అధినేత శ్రీధర్ రెడ్డి కి , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బాలకృష్ణకి అత్యంత సన్నిహితుడు కనుక ఆ నిధులు దుర్వినియోగం ఎక్కడ అయ్యాయి, ఈ రెండు సంవత్సరాల్లో ఆ పనులు ఎందుకు పూర్తి కాలేదు, అనే వాటిపైన విజిలెన్స్ ఎంక్వయిరీ పెట్టాల్సిన అవసరం ప్రస్తుత ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పై ఉందని తెలిపారు. అంతేకానీ 14 కోట్లు రూపాయలు ప్రతాప్ కుమార్ రెడ్డి తిన్నారని ఆరోపణలు తనపై వేయటం సరికాదన్నారు. అమృత పథకం స్కీం అవినీతిపై ఎంక్వయిరీ పెట్టాలని, అలాగే 126 ఎకరాలు భూ కబ్జాకు గురైన విషయం, మనీ స్కీమ్ 100 కోట్లు బాధితులకు లెక్క చెప్పాల్సిన అవసరం ఎమ్మెల్యే పై ఎంతైనా ఉందని, వాటి విషయం విజిలెన్స్ ఎంక్వయిరీ పెట్టి రికవరీ చేసినట్లయితే.., ప్రస్తుత ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కాళ్లు కాడికి యానాదిరెడ్డి బొమ్మ వద్ద శభాష్ అని అభినందిస్తనూ అని పేర్కొన్నారు. దొంగలందరినీ నీవెంట పెట్టుకొని వారిని కాపాడే క్రమంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఉన్నారని, ఆయన అవినీతి బయటపడకుండా చూసుకోవడానికి ఎంతటికైనా తెగించి, ఎదుటి వారిని నష్టపరచాలని క్రిమినల్ మైండ్ తో శాసనసభ్యులుగా కొనసాగుతున్నారని, ఇది కావలి ప్రజలకు ప్రమాదకరమైన పరిస్థితి అని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేసిన అవినీతి ఆరోపణలపై వీడియోల ద్వారా పేపర్ క్లిప్పింగుల ద్వారా ప్రొజెక్టర్ల వేసి చూపించి మీడియాకు తెలియజేశారు. కావలి ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వారిని మభ్య పెట్టాలని చూస్తే తగిన మూల్యం ఎమ్మెల్యే చెల్లించుకోక తప్పదని ఘాటైన మాటలు పలికారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గం లోని వైయస్సార్ సిపి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోపీనగర్ 'జీఎన్ స్ట్రైకర్స్11" క్రికెట్ జెర్సీని ఆవిష్కరించిన మారబోయిన రవి యాదవ్





**శేర్లింగంపల్లి,జూన్07.అక్షర టైమ్స్:-** ప్రతినిధిగోపీనగర్‌కు చెందిన శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న 'జీఎన్ స్ట్రైకర్స్--11' జట్టు సరికొత్త జెర్సీని మారబోయిన రవి యాదవ్ ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు.శ్రీకాంత్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రవి యాదవ్ పాల్గొని, జట్టు ఆటగాళ్లకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు."ఈ టోర్నమెంట్‌లో జీఎన్ స్ట్రైకర్స్--11 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎం ఆర్ వై ఫౌండేషన్ లోగో జెర్సీపై ఉండటం ఎంతో ఆనందకరమైన విషయం. యువతలోని ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలకు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది.మారబోయిన రవి యాదవ్ఈ టోర్నమెంట్‌లో జీఎన్ స్ట్రైకర్స్--11 జట్టు అద్భుత ప్రదర్శనతో ఘన విజయాలు సాధించాలని కార్యక్రమ నిర్వాహకులు, స్థానిక యువత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు మరియు స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వ వార్త
మా కలం...సామాన్యుడి గళం
తెలుగు దినపత్రిక
సోమవారం 08 - 06 - 2026

## తల్వార్ తాత బృందానికి ఘన సన్మానం చేసిన వెల్మకన్నె గ్రామస్తులు



**తెలంగాణ :** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ,అభివృద్ధి మరియు నాణ్యమైన విద్య అందరికీ అందాలనే లక్ష్యంతో పాదయాత్ర నిర్వహిస్తున్న తల్వార్ తాత బృందానికి మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామస్తులు ఘన సన్మానం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల బలోపేతం కోసం వారు చేస్తున్న విశేష కృషిని అభినందిస్తూ గ్రామ ప్రజల తరపున తల్వార్ తాత టీంను ఘనంగా సన్మానించారు.విద్యాభివృద్ధి కోసం సమాజంలో అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగుతున్న వారి సేవలు ఆదర్శప్రాయమైనవని,వారి పాదయాత్ర విజయవంతంగా కొనసాగి,ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలని మనస్ఫూర్తిగా గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ శిబిరం

- 45 రోజుల శిక్షణలో 38 మంది క్రీడాకారులకు మెరుగైన నైపుణ్యాలు

- యువతకు ఏఎస్ఐ నరసింహులు సూచనలు




**తెలంగాణ :** గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో, మేడ్చల్ జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి (డీవైఎస్ఓ) దామోదర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ నరసింహులు హాజరై క్రీడాకారులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం, ప్రయాణాల సమయంలో సీట్‌బెల్ట్ వినియోగించడం తప్పనిసరి అని సూచించారు. అలాగే మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి సమాజాభివృద్ధికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు.చర్లపల్లి సరస్సు వద్ద ఏప్రిల్ 24 నుంచి జూన్ 7 వరకు 45 రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 38 మంది బాలబాలికలు పాల్గొన్నారు.స్ప్రింట్స్, మధ్య మరియు దీర్ఘదూర పరుగు, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, హర్డిల్స్, రేస్‌వాక్ తదితర అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడాకారులకు శిక్షణ అందించినట్లు కోచ్ తిరుమలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. భద్రం, వెంకీ, రాజేష్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. అధికారులు, తల్లిదండ్రులు, క్రీడాకారుల సమిష్టి కృషితో శిబిరం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

## చిన్న చర్లపల్లిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం

శంకర్ ఆధ్వర్యంలో నిర్వహణ

- నేమురి మహేష్ గౌడ్, బొడిగే రాజు తదితరుల పాల్గొనిక






**తెలంగాణ :** కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలో చిన్న చర్లపల్లిలో వేసవి వేడిని దృష్టిలో ఉంచుకుని శంకర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు చేశారు.కార్యక్రమంలో నేమురి మహేష్ గౌడ్, బొడిగే రాజు, నర్సింహ, వేణుగోపాల్ రెడ్డి, లోక్నాథ్, నవీన్ పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.స్థానిక ప్రజలు కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## వంజరి కుల ఆత్మగౌరవ భవనం ప్రారంభం..

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.







**తెలంగాణ :** ఉప్పల్ బాగాయత్‌లో తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై వంజరి సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సమాజ అభ్యున్నతి, విద్యా ప్రగతి, సామాజిక ఐక్యతకు ఆత్మగౌరవ భవనాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. వంజరి సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హెచ్. హనుమంతరావు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొని వంజరి సమాజ ప్రతినిధులను అభినందించారు.వంజరి సమాజ ఐక్యతకు, సామాజిక అభివృద్ధికి ఈ ఆత్మగౌరవ భవనం కేంద్రబిందువుగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమం విజయవంతం కావడంపై తెలంగాణ వంజరి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కే. వెంకటేశం, కార్యనిర్వహణ కార్యదర్శి వంజరీ ప్రవీణ్‌తో పాటు పలువురు సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## టాటా ఏసీ వాహనం బోల్తా పలువురికి తీవ్ర గాయాలు



**తెలంగాణ :** అశ్వాపురం మండల పరిధిలోని మొండి కుంట గ్రామం పెట్రోల్ బంక్ సమీపంలో, భద్రాచలం నుండి మణుగూరు వైపు వెళు _న్న టాటా ఏ సీ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన, స్థలానికి, సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ లో పనిచేస్తున్న, వ్యక్తులు పలువురు వెళ్లి వాహనంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. గాయాలైన వారిని సమీపంలో ఉన్న హాస్పిటల్ కి తరలించినారు.

# సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ

పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్వీ కిట్టు ఆధ్వర్యంలో

సభా ప్రాంగణానికి భారీ ర్యాలీగా చేరుకున్న కార్యకర్తలు







**మల్లాపూర్,జూన్07.అక్షర టైమ్స్:-**ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్వీ కిట్టు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.డప్పులు, జెండాలు, నినాదాలతో సాగిన ఈ ర్యాలీ సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేత మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. సభలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి ప్రసంగించగా, కార్యకర్తలు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు.భారీ జనసందోహం, కాంగ్రెస్ శ్రేణుల ఉత్సాహం, క్రమశిక్షణతో నిర్వహించిన ర్యాలీ సభ విజయవంతానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలాన్ని మరోసారి చాటిచెప్పిన కార్యక్రమంగా ఈ సభ నిలిచింది.

## సంచార జాతుల విద్యార్థులకు ప్రోత్సాహం - ప్రతిభావంతులకు సత్కారం








**హైదరాబాద్,జూన్07.అక్షర టైమ్స్:-**సంచార జాతుల విద్యార్థుల్లో విద్యాపై ఆసక్తిని పెంపొందించి, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో సంచార తెగల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, జ్ఞాపికల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రేండ్ల శంకర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను సన్మానించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 102 మంది విద్యార్థులు, 73 మంది తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ అధికారులు, సామాజిక వేత్తలు విద్యార్థులను అభినందిస్తూ ఉన్నత విద్య ద్వారా జీవితంలో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యే వ్యక్తిగత అభివృద్ధికి, సమాజ ప్రగతికి మూలస్తంభమని పేర్కొన్నారు.రేండ్ల శంకర్ మాట్లాడుతూ, సంచార జాతుల విద్యార్థులు విద్యను ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. భవిష్యత్ తరాల అభివృద్ధికి విద్య అత్యంత కీలకమని పేర్కొన్నారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులకు భోజన వసతి కల్పించారు.

# కాకినాడ రైల్వే స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్ల ఆగడాలు

ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు.!

**కాకినాడ,జూన్05.అక్షర టైమ్స్:-**కాకినాడ రైల్వే స్టేషన్‌కు చేరుకునే ప్రయాణికులు ఆటో డ్రైవర్ల వేధింపులతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో కొందరు ఆటో డ్రైవర్లు బయట నుంచి వచ్చే ఆటోలను అనుమతించకుండా అడ్డుకుంటూ, ప్రయాణికులు తప్పనిసరిగా తమ ఆటోలనే ఎక్కాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.ప్రయాణికుల కథనం ప్రకారం, రైల్వే స్టేషన్‌కు ముందుగానే బుక్ చేసుకున్న లేదా బయట నుంచి వచ్చిన ఆటోల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తే కొందరు స్థానిక ఆటో డ్రైవర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది. అంతేకాకుండా, గమ్యస్థానానికి సాధారణంగా తీసుకునే ఛార్జీల కంటే ఎక్కువ మొత్తాన్ని డిమాండ్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో వచ్చిన ప్రయాణికులు, వృద్ధులు, మహిళలు ఈ పరిస్థితుల వల్ల ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత తీవ్రమవుతోందని ప్రయాణికులు చెబుతున్నారు.ప్రజా రవాణా కేంద్రాల వద్ద ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రైల్వే అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకుని అక్రమ వసూళ్లు, బలవంతపు ఆటో సేవలను అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.ఇలాంటి ఘటనలపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ రైల్వే స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్ల ఆగడాలు"మా ఆటోనే ఎక్కాలి" -- ప్రయాణికులపై ఒత్తిడి చేస్తున్న ఆటో డ్రైవర్లునోటికి వచ్చినంత ఛార్జీ.. కాకినాడ స్టేషన్‌లో ప్రయాణికుల గోడుబయటి ఆటోలకు నో ఎంట్రీ? స్టేషన్ వద్ద ఆటో మాఫియా ఆరోపణలు,కాకినాడలోనే కాకుండా సామర్లకోట, రాజమండ్రి, తదితర ప్రాంతాల్లో కూడా ఇదే తంతు జరుగుతుందని ప్రయాణికులు తెలియజేస్తున్నారు.



# కేర్ గివర్ బర్నౌట్

క్యాన్సర్ సంరక్షణ వెనుక నిశ్శబ్దంగా అలసిపోయే మనసు

కొన్ని హృదయాలు ప్రేమ తక్కువై అలసిపోవు.

మరొకరి బాధను ఎక్కువకాలం మోస్తూ అలసిపోతాయి.

కేర్ గివింగ్ అనేది ప్రేమే




కానీ ఆ ప్రేమకూ కొన్నిసార్లు ఒక విశ్రాంతి, ఒక ఓదార్పు, ఒక భుజం అవసరం.క్యాన్సర్ ప్రయాణం గురించి మాట్లాడినప్పుడు మనం ఎక్కువగా రోగి బాధ, చికిత్స, ధైర్యం, ఆశ గురించి మాట్లాడుతాము. కానీ ప్రతి క్యాన్సర్ రోగి పక్కన నిశ్శబ్దంగా ఇంకొకరు కూడా ప్రయాణిస్తుంటారు. వాళ్లు రోగి కంటే తక్కువగా బాధపడరు. తేడా ఏంటంటే, వారి బాధకు చాలా సార్లు పేరు ఉండదు. వారి కన్నీళ్లు చాలా సార్లు కనిపించవు. వారి అలసటను ఎవరూ అడగరు.ఆ వ్యక్తే కేర్ గివర్‌ఆమె ఒక భార్య కావచ్చు.అతను ఒక భర్త కావచ్చు.ఒక తల్లి, ఒక తండ్రి, ఒక కూతురు, ఒక కుమారుడు, ఒక కోడలు, ఒక అమ్మమ్మ లేదా ఒక స్నేహితుడు కావచ్చు.వాళ్లు వైద్యులు కాదు. కానీ రోగి జీవితానికి ప్రతిరోజూ మందులా మారిపోతారు. వాళ్లు నర్సులు కాదు. కానీ రాత్రింబవళ్లు చూసుకునే చేతులవుతారు. వాళ్లు కౌన్సెలర్లు కాదు. కానీ రోగి భయపడినప్పుడు ధైర్యం చెప్పే స్వరమవుతారు.కేర్ గివర్ జీవితం బయటకు చూస్తే బాధ్యతలా కనిపిస్తుంది. కానీ లోపల అది ఒక పెద్ద భావోద్వేగ సముద్రంమందులు ఇవ్వాలి. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. రిపోర్టులు చూసుకోవాలి. డబ్బు సమకూర్చాలి. ఇంట్లో వాళ్లకు చెప్పాలి.రోగికి ధైర్యం ఇవ్వాలి.రోగి ముందు ఏడవకూడదు. ఏం జరుగుతుందో తెలియకపోయినా, అన్నీ బాగానే అవుతాయని చెప్పాలి.ఇలా చేస్తూ చేస్తూ, ఒక రోజు కేర్ గివర్ తనను తాను మర్చిపోతాడు.తన నిద్రను మర్చిపోతాడు.తన ఆకలిని మర్చిపోతాడు.తన భయాన్ని మర్చిపోతాడు.తన కన్నీళ్లను కూడా మర్చిపోతాడు.రోగి ముందు నవ్వుతాడు. కానీ ఒంటరిగా ఉన్నప్పుడు మనసు విరిగిపోతుంది. ఇదే కేర్ గివర్ బర్నౌట్.సైకో ఆంకాలజీ దృష్టిలో కేర్ గివర్ బర్నౌట్ అనేది కేవలం శరీర అలసట కాదు.ఇది మనసు లోతుల్లో పేరుకునే మౌన వేదన. ప్రేమ, భయం, అపరాధ భావన, నిస్సహాయత, బాధ్యత, ముందుగానే కోల్పోతామేమో అన్న దుఃఖం ఇవన్నీ కలిసి కేర్ గివర్ హృదయాన్ని బరువుగా మారుస్తాయి.చాలా మంది కేర్ గివర్స్ లోపల ఇలా అనుకుంటారు.నేను బలహీనపడితే వాళ్లను ఎవరు చూసుకుంటారు.?నేను ఏడిస్తే వాళ్లు మరింత భయపడతారు.నేను అలసిపోయానని చెప్పడం సరైనదా?నా బాధకు ఇప్పుడు సమయం ఉందా.?అలా వాళ్లు తమ భావాలను లోపలే దాచుకుంటారు. అందరికోసం బలంగా నిలబడతారు. కానీ తమకూ ఒక బలం కావాలని మర్చిపోతారు.సైకో ఆంకాలజీ రీసెర్చ్ లో భాగంగా నా ఆసుపత్రి సందర్శనల్లో ఈ నిజం నాకు చాలా లోతుగా తాకింది. క్యాన్సర్ ఒక్క రోగిని మాత్రమే తాకదు. అది కుటుంబం మొత్తం జీవనశైలిని మార్చేస్తుంది. ఇంటి మాటలు మారిపోతాయి. భోజన సమయాలు మారిపోతాయి. నిద్రలేని రాత్రులు పెరుగుతాయి. ఆశ, భయం, ఖర్చులు, చికిత్సలు, ప్రార్థనలు అన్నీ ఒకే జీవితంలో కలిసిపోతాయి.బెంగళూరులోని కిడ్వై మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ వద్ద నేను చూసిన కుటుంబాలు ఇప్పటికీ నా మనసులో నిలిచిపోయాయి.చేతిలో రిపోర్టులు, కళ్లలో ప్రార్థనలు, పెదవులపై బలవంతపు ధైర్యం. డాక్టర్ బయటకు వచ్చి ఒక్క మాట చెప్పినా, ఆ మాటపై ఒక కుటుంబం రోజు మొత్తం ఆధారపడి ఉంటుంది. కేర్ గివర్స్ ముఖాల్లో భయం కనిపిస్తుంది. కానీ రోగి వైపు తిరిగినప్పుడు అదే ముఖం ఆశగా మారిపోతుంది.బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో నేను గమనించిన విషయం మరింత లోతైనది. క్యాన్సర్ చికిత్స అనేది రోగి శరీరానికి మాత్రమే జరిగే ప్రక్రియ కాదు. అది కుటుంబం మొత్తం మోయాల్సిన ప్రయాణం.శస్త్రచికిత్స, కీమోథెరపీ, ఫాలో అప్‌లు, ఆహార నియమాలు, శరీరంలో మార్పులు, ఆర్థిక ఆందోళనలు, రోగి మనసులో వచ్చే మార్పులు ఇవన్నీ కేర్ గివర్‌ను కూడా తాకుతాయి. అయినా వారు వెనక్కి తగ్గరు. అలసిపోయినా నిలబడతారు. ఎందుకంటే ప్రేమ వారికి బాధ్యతగా మారిపోయి ఉంటుంది.నా అన్ని అనుభవాలలో కరుణాశ్రయ ప్యాలియేటివ్ కేర్ సెంటర్ సందర్శన నా హృదయాన్ని ప్రత్యేకంగా తాకింది.అక్కడికి వెళ్లినప్పుడు ప్యాలియేటివ్ కేర్ అంటే ఆశ వదిలేయడం కాదని, మనిషిని చివరి వరకు గౌరవంగా, ప్రశాంతంగా, ప్రేమతో నిలబెట్టడం అని అర్థమైంది. అక్కడి నిశ్శబ్దం కూడా ఓదార్పులా అనిపించింది. ప్రకృతికి దగ్గరగా ఉండే ఆ వాతావరణం, ప్రశాంతమైన నిర్మాణం, ప్రార్థనకు ఉన్న స్థలం, కరుణతో పనిచేసే బృందం ఇవన్నీ కలిసి ఒక విషయం చెప్పినట్లు అనిపించాయి. బాధను తొలగించలేకపోయినా, బాధపడుతున్న మనిషిని గౌరవంగా పట్టుకోవచ్చు.కరుణాశ్రయలో నాకు హృదయానికి హత్తుకున్న విషయం ఏమిటంటే, అక్కడ రోగిని ఒక వ్యాధిగా చూడరు. బెడ్ నంబర్‌గా చూడరు. కేస్ ఫైల్‌గా చూడరు. ఆ మనిషి వెనుక ఉన్న జీవితం, జ్ఞాపకాలు, బంధాలు, భయాలు, ఆశలు, ఆధ్యాత్మిక అవసరాలు అన్నింటినీ గౌరవిస్తారు. అక్కడ డిగ్నిటీ అఫ్ కేర్ అంటే ఏమిటో స్పష్టంగా అనిపించింది. ఒక మనిషి బలహీనంగా ఉన్నా, అతని గౌరవం బలహీనపడకూడదు. చికిత్స పరిమితమైనా, కరుణకు పరిమితి ఉండకూడదు.అక్కడ నాకు ఇంకొక విషయం కూడా అర్థమైంది. కేర్ గివర్స్‌కూ శ్వాస తీసుకునే స్థలం కావాలి. రోగి బాధను మోసే వారి మనసుకూ ఎవరైనా ఓదార్పు చెప్పాలి. కరుణాశ్రయ వాతావరణం కేర్ గివర్ నిశ్శబ్ద వేదనను కూడా గుర్తించినట్టుగా అనిపించింది.కేర్ గివర్ బర్నౌట్‌తగ్గాలంటే, ముందుగా కేర్ గివర్ కూడా సంరక్షణకు అర్హుడని మనం అంగీకరించాలి. వాళ్లకు కూడా విశ్రాంతి కావాలి. వాళ్లకూ భయం ఉంటుంది. వాళ్లకూ కోపం వస్తుంది. వాళ్లకూ ఏడవాలని అనిపిస్తుంది. ఇవేవీ తప్పు కాదు. ఇవన్నీ మానవ అనుభూతులు.కేర్ గివర్‌కు రోజులో కొద్దిసేపైనా తనకోసం సమయం ఇవ్వాలి.చిన్న చిన్న అలవాట్లు కూడా పెద్ద ఉపశమనం ఇస్తాయి. కొద్దిసేపు నిశ్శబ్దంగా కూర్చోవడం, లోతుగా శ్వాస తీసుకోవడం, ప్రార్థన చేయడం, డైరీ రాయడం, నడవడం, సంగీతం వినడం, తన భావాలను నమ్మకమైన వ్యక్తితో పంచుకోవడం ఇవి మనసుకు మెల్లగా బలం ఇస్తాయి.ఇక్కడ సైకాలజిస్ట్ లేదా సైకో ఆంకాలజిస్ట్ పాత్ర చాలా ముఖ్యమైనది.కేర్ గివర్ తన భయం, కోపం, అపరాధ భావన, నిస్సహాయత, దుఃఖం అన్నిటినీ తీర్పు లేకుండా చెప్పుకునే సురక్షిత స్థలం అవసరం.కౌన్సెలింగ్‌లో కేర్ గివర్ తన భావాలను అర్థం చేసుకోవడం నేర్చుకుంటాడు.ఎలా కోప్ చేయాలి, ఎలా బౌండరీస్ పెట్టుకోవాలి, ఎలా రిలాక్స్ కావాలి, ఎలా తనను తాను కరుణతో చూడాలి అనే విషయాల్లో సహాయం పొందుతాడు.స్వీయ సంరక్షణ స్వార్థం కాదు. అది కేర్ గివింగ్ లో ఒక ముఖ్యమైన భాగం. మనసు ఖాళీ అయిపోయినప్పుడు మరొకరికి ప్రేమ ఇవ్వడం కూడా కష్టం అవుతుంది. కాబట్టి కేర్ గివర్ తనను తాను చూసుకోవడం అంటే రోగిని వదిలేయడం కాదు. మరింత ఆరోగ్యంగా, మరింత సున్నితంగా, మరింత స్థిరంగా రోగి పక్కన నిలబడడానికి తనను తాను సిద్ధం చేసుకోవడం.క్యాన్సర్ సంరక్షణ పూర్తి కావాలంటే రోగిని మాత్రమే కాదు, కేర్ గివర్‌ను కూడా చూడాలి. రోగికి చికిత్స, గౌరవం, శాంతి, ఆశ అవసరం. కేర్ గివర్‌కు అర్థం చేసుకునే మనసు, విశ్రాంతి, భావోద్వేగ మద్దతు, కరుణ అవసరం.కేర్ గివర్ అనేది రోగి పడక పక్కన నిలిచే హృదయం.కానీ ఆ హృదయాన్ని కూడా ఎవరో ఒకరు సున్నితంగా పట్టుకోవాలి.ప్రతి కేర్ గివర్‌కు నా హృదయపూర్వక మాటమీరు అలసిపోయారు కాబట్టి బలహీనులు కాదుమీరు అనుభూతి చెందుతున్నారు కాబట్టి మీరు మనిషిమిమ్మల్ని మీరు చూసుకోవడం కూడా మీ ప్రియమైన వ్యక్తిని చూసుకోవడంలో ఒక భాగమే

ప్రవీణ సాన
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ & సైకో ఆంకాలజిస్ట్
అంబవరం సెంటర్ ఫర్ సైకలాజికల్ రీసెర్చ్ అండ్ వెల్బీయింగ్ అసోసియేషన్
విజయవాడ,ఆంధ్రప్రదేశ్

# శేరిలింగంపల్లి సమగ్ర ప్రగతికి సరికొత్త నాంది..

**నేడే పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు**



**శేరిలింగంపల్లి,జూన్07.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేస్తూ, మౌలిక వసతుల కల్పనలో సరికొత్త విప్లవానికి వేదిక సిద్ధమైంది. నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలలను సాకారం చేస్తూ జూన్ 8న సాయంత్రం 5:00 గంటలకు పలు భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఘనంగా జరగనున్నాయి.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రజలకు అంకితం చేయనున్నారు.ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత విముక్తి..ఐటీ కారిడార్‌గా శరవేగంగా విస్తరిస్తున్న శేరిలింగంపల్లిలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ క్రింది కీలక ఫ్లైఓవర్ ప్రాజెక్టులను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.మియాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్లింగంపల్లి ఆర్‌ఓబీ ఫ్లైఓవర్గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ ఫ్లైఓవర్కాజాగూడ జంక్షన్ ఫ్లైఓవర్ఈ ఫ్లైఓవర్ల నిర్మాణంతో వాహనదారులకు ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోనున్నాయి.విద్యారంగానికి పెద్దపీట:కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులకు" ఈ సందర్భంగా శంకుస్థాపన చేయనున్నారు.విజయవంతం చేయాలని పిలుపు:నియోజకవర్గ ప్రగతి ప్రస్థానంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈ మహత్తర కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, వివిధ కాలనీల అసోసియేషన్ సభ్యులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా కొండాపూర్ మాజీ కార్పొరేటర్ హమీత్ పటేల్ హృదయపూర్వక పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టుల ప్రారంభంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో సరికొత్త మైలురాయిని అధిగమించబోతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు

**లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి**

**విద్యపై పెట్టే ప్రతి రూపాయి - భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**





**బోనకల్,జూన్07.అక్షర టైమ్స్:-**రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు కేవలం భవనాలు కావని, అవి రేపటి తరాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దే 'దార్శనిక దేవాలయాలు' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్లు మండలం లక్ష్మీపురంలోని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నాణ్యతతో.. వేగంగా పూర్తి చేయాలినిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలోని భవన సముదాయాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాలినడకన తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్ విభాగాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వేదికలుగా నిలిచే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పనులను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను (కాంట్రాక్టర్లను) ఆదేశించారు.ఆలోచనే ఒక పెట్టుబడి!విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి.. కేవలం వ్యయం కాదు, అది రాబోయే భవిష్యత్ తరాలను శక్తివంతంగా నిర్మించడం కోసం పెట్టే అద్భుతమైన పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.లక్ష్మీపురం స్కూల్ ఆవరణ అంతా తిరుగుతూ పనుల ప్రగతిని స్వయంగా అంచనా వేసిన డిప్యూటీ సీఎం. సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్, మెకానికల్ ల్యాబ్ భవనాల నిర్మాణ నాణ్యతపై అధికారులకు కీలక సూచనలు. గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులకు డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు.

# మహిళాభ్యున్నతికై అంబేద్కర్ కృషిని కొనసాగిద్దాం

**పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**



**బోనకల్,జూన్07.అక్షర టైమ్స్:-**మహిళల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చేసిన కృషిని అభ్యుదయ వాదులు కొనసాగించాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం స్థానిక సి.పి.ఎం కార్యాలయంలో మహిళాభ్యున్నతి - అంబేద్కర్ కృషి అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అంబేద్కర్ ప్రపంచ మేధావి, సామాజిక శాస్త్రవేత్త కాగా కేవలం దళిత నాయకుడిగా చూస్తూ దళిత వాడల్లో ఆయన విగ్రహాలు పెట్టడం తప్పన్నారు. అంబేద్కర్ అంటే రిజర్వేషన్ మాత్రమే గుర్తుకు రావడం అంటే ఆయనను సంపూర్ణంగా అధ్యయనం చేయకపోవడం వల్ల జరిగే లోపం అన్నారు. జాతీయ నేతల్లో సమగ్ర దేశాభివృద్ధి, అణచివేత, పీడన, మూఢత్వం, అసమానతలన్నింటిపైనా తనదైనశైలిలో పరిష్కారాలు సూచించిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. ఓ సమాజం ఎంతగా అభివృద్ధి చెందింది అన్నది ఆ సమాజంలో స్త్రీల పరిస్థితిని బట్టి అంచనా వేయాలన్న మేధావి అంబేద్కర్ అన్నారు. స్త్రీలు హక్కులు, అభ్యున్నతి కోసం పరిష్కారం చెప్పడమే కాకుండా హిందూ కోడ్ బిల్లు రూపొందించారని గుర్తు చేశారు. ఆ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందనందున నిరసనగా న్యాయశాఖ మంత్రి పదవికి ఏకంగా రాజీనామా చేసిన ధీశాలి అన్నారు. ప్రపంచ పార్లమెంటరీ చరిత్రలో ఇది అరుదైన ఘట్టం అన్నారు.మహిళా విద్య, రాజకీయ, ఆర్థిక అవకాశాలు, సమాన పని, వేతనాలు, ప్రసూతి సెలవులు, గర్భిణీ స్త్రీలకు రక్షణ, ఆస్తి హక్కు, వారసత్వపు హక్కు, దత్తత హక్కు, సమాన గౌరవం కోసం చట్టాలు రూపొందించి పార్లమెంట్ లో వాటి ఆమోదం కోసం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ కు భారతదేశంలో మహిళలు ఋణపడి ఉంటారన్నారు. బోధించు-సమీకరించు-పోరాడు అన్న అంబేద్కర్ పిలుపు వింటే కేవలం దళితుల కోసం మాత్రమే కాకుండా భారత దేశం సమగ్ర అభివృద్ధి కోసం అంబేద్కర్ సూచించిన విషయాల్లో యువత, మహిళలు ముందుండి పోరాడాలన్నారు. మహిళలు చదువుకుని చైతన్యం పొంది పోరాటాల్లో భాగస్వామ్యం వహిస్తే మెరుగైన సమాజం ఏర్పడడం ఖాయమని తెలిపారు. చదువుకున్న తల్లి పిల్లల పెంపకంలో ఆడా,మగా సమానంగా పెంచుతుందని, బానిస, మత ఛాందస భావాలను మెదళ్ళకు నుండి సమూలంగా ప్రక్షాళన చేసి సమగ్రంగా, చైతన్యవంతంగా ఆలోచింపజేసే భావి భారత పౌరులను తయారు చేయగలుగుతుంది న్నారు. మత ఛాందసం, పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే టీవీ సీరియల్స్ వల్ల మహిళలే మహిళలకు శత్రువులన్నట్లు పరిస్థితి ఉందన్నారు. మహిళలు చైతన్యం పెంచుకుని అభ్యుదయ శక్తులతో కలిసి సమా జంలో మత ఛాందసం, మూఢత్వం, మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు సంపూర్ణంగా చెక్ పెట్టేందుకు పోరాటాలలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షులు జొన్నలగడ్డ సునీత, కృష్ణవేణి, సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్ , వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, సిఐటియు మండల నాయకులు గుగులోత్ నరేష్, బూర్గుల అప్పాచారి, కుక్కల కోటేశ్వరరావు, బొప్పాల రమేష్, అజెయ్ కుమార్, జయరాజ్, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## సామర్లకోటలో విషాదం.. లారీ ఢీకొని భార్యాభర్తల మృతి



**కాకినాడ,జూన్07.అక్షర టైమ్స్:-**గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సామర్లకోటకు చెందిన భార్యాభర్తలు జూరెడ్డి వెంకట సూర్యనారాయణ (45), జూరెడ్డి. అరుణకుమారి(40)లు దుర్మరణం పాలయ్యారు. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## సోమవారం కలెక్టరేట్లో పీజీఆర్ఎస్,రెవెన్యూ క్లినిక్: కలెక్టర్

**కాకినాడ,జూన్07.అక్షర టైమ్స్:-**సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులంతా ఖచ్చితంగా హాజరుకావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు '1100' నెంబర్ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు కూడా 1100 నెంబర్కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.




# ఎంపీ పదవికి రాజీనామాపై యూసుఫ్ పఠాన్ క్లారిటీ

**ఆ వార్తలన్నీ అవాస్తవమన్న టీఎంసీ నేత**

**ఎంపీ పదవికి రాజీనామా చేయాలని మమతా బెనర్జీ**

**అడిగారన్న వార్తలను ఖండించిన యూసుఫ్ పఠాన్**

**మమతా గానీ, పార్టీలోని మరే ఇతర నేత గానీ తనను**

**సంప్రదించలేదని స్పష్టీకరణ**



తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ కోసం తన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని అధిష్ఠానం కోరినట్లు వస్తున్న వార్తలపై మాజీ క్రికెటర్, టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ స్పష్టతనిచ్చారు. ఆ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు నిన్న సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు."గత కొంతకాలంగా సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతోంది. బెర్హంపూర్ లోక్‌సభ స్థానానికి నేను రాజీనామా చేయాలని, తద్వారా మమతా బెనర్జీ అక్కడ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై మమతా బెనర్జీ నాతో ఎప్పుడూ చర్చించలేదు. పార్టీలోని ఏ ఒక్క నాయకుడు కూడా నన్ను రాజీనామా చేయమని అడగలేదు. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవం" అని యూసుఫ్ పఠాన్ తన వీడియోలో పేర్కొన్నారు.మమతా బెనర్జీకి, యూసుఫ్ పఠాన్‌కు మధ్య భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మధ్యవర్తిత్వం వహించారన్న ఆరోపణలను గంగూలీ సైతం తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. మమతా బెనర్జీ తనను ఈ విషయంలో ఎప్పుడూ సంప్రదించలేదని, తాను పఠాన్‌తో మాట్లాడలేదని, ఈ వార్తలు కేవలం కల్పితమని గంగూలీ స్పష్టం చేశారు.2024 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బెర్హంపూర్ స్థానం నుంచి టీఎంసీ తరఫున పోటీ చేసిన యూసుఫ్ పఠాన్ విజయం సాధించారు. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరిని ఆయన ఓడించారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ కోసం పఠాన్ తన సీటును త్యాగం చేయాల్సి వస్తుందని గత కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారానికి ఆయన తాజా ప్రకటనతో తెరపడింది.

# పనిఒత్తిడితో వీఆర్వో ఆత్మహత్య

**కర్నూలులో కలకలం, విచారణకు ఆదేశం**

**కర్నూలులో గ్రేడ్-2 వీఆర్వో ఆత్మహత్య**

**పని ఒత్తిడి, అధికారుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ**

**ఈ ఘటనపై రెవెన్యూ ఉద్యోగుల నిరసన, కలెక్టరేట్ వద్ద ఆందోళన**

**సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్**



కర్నూలు నగరంలో ఓ గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది. అధిక పని ఒత్తిడి, ఉన్నతాధికారుల వేధింపుల వల్లే ఆయన ఈ విపరీత నిర్ణయం తీసుకున్నారని మృతుడి కుటుంబ సభ్యులు, సహోద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై రెవెన్యూ సిబ్బంది పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.నగరంలోని 30వ సచివాలయంలో గ్రేడ్-2 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న షేక్ మహమ్మద్ హుస్సేన్ (49) శనివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉన్నతాధికారుల నుంచి విపరీతమైన పని ఒత్తిడి ఎదురైందని, దీనివల్ల ఆయన తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. హుస్సేన్ మృతికి కారణమైన పరిస్థితులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ శాఖ ఉద్యోగులు కర్నూలు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు.మృతుడి కుటుంబ సభ్యుల ఆరోపణలు, ఉద్యోగ సంఘాల ఆందోళనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, వాస్తవాలను నిగ్గుతేలుస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులపై పనిభారం మితిమీరిపోతోందని, ఈ సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం అధికారులు ఈ ఆత్మహత్యకు దారితీసిన కచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మందమర్రి వద్ద బోల్తాపడ్డ టీజీఎస్ఆర్టీసీ బస్సు

**తప్పిన పెను ప్రమాదం**

**డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పిన వాహనం**

**ప్రమాద సమయంలో బస్సులో ఒక్కరే ప్రయాణికుడు**

**ఈ ఘటనలో డ్రైవర్, ప్రయాణికుడికి స్వల్ప గాయాలు**

**ప్రయాణికులు ముందే దిగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం**




మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ సమీపంలో ఆదివారం ఉదయం టీజీఎస్ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది.వివరాల్లోకి వెళ్తే.. కొత్తగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మందమర్రి సమీపానికి రాగానే, డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి నుంచి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్‌తో పాటు కేవలం ఒకే ఒక్క ప్రయాణికుడు ఉన్నట్లు సమాచారం. మిగతా ప్రయాణికులందరూ అప్పటికే తమ గమ్యస్థానాల్లో దిగిపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది.సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్, ప్రయాణికుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బస్సును అక్కడి నుంచి తొలగించారు. డ్రైవర్ అలసటే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

# తమిళ రాజకీయాల్లో అన్నామలై సంచలనం



తమిళనాడు రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఐపీఎస్ అధికారి కె.అన్నామలై బీజేపీకి రాజీనామా చేసిన మరుసటి రోజే తన రాజకీయ విశ్వరూపాన్ని చూపించారు. జూన్ 5న బీజేపీకి అధికారికంగా గుడ్ బై చెప్పిన ఆయన.. ఆ వెంటనే "వి ద లీడర్స్"అనే పేరుతో ఒక సరికొత్త ప్రజా ఉద్యమాన్ని, రాజకీయ వేదికను ప్రారంభించారు. ఈ వేదిక ప్రారంభించిన 24 గంటల్లోనే దాదాపు 14 లక్షల (13.85 లక్షలకు పైగా) మంది వలంటీర్లుగా సైన్ అప్ చేసి అన్నామలై క్రేజ్ ఏంటో నిరూపించారు.అన్నామలై నిష్క్రమణతో తమకేం నష్టం లేదని బీజేపీ ప్రకటించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. అన్నామలై రాజీనామా చేసిన వెంటనే, ఆయనకు మద్దతుగా తమిళనాడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజన్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు కూడా తమ పదవులకు రాజీనామా చేసి అన్నామలై కొత్త ఉద్యమ బాట పట్టారు. లక్ష్యం.. లోక్‌సభ ఎన్నికలుఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ.. "తమిళనాడులో ఇకపై వారసత్వ రాజకీయాలు, ఒకే ఒక్కడి చుట్టూ తిరిగే కల్ట్ రాజకీయాలు సాగవు. సామాన్యుడే పాలకుడు కావాలి, అదే మా 'వి ద లీడర్స్' ముఖ్య ఉద్దేశం" అని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, యువత సముద్ధరణే ధ్యేయంగా ఈ ఉద్యమం సాగుతుందని.. భవిష్యత్తులో దీనిని ఒక పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నిలుపుతామని ఆయన ప్రకటించారు. అంతేకాకుండా, కాబోయే రాజకీయ నాయకులకు నైతిక విలువలతో కూడిన శిక్షణ ఇవ్వడం కోసం "ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్స్" ను స్థాపించబోతున్నట్లు వెల్లడించారు.అన్నామలై నిర్ణయాలపై ప్రత్యర్థి పార్టీలు కూడా తక్షణమే స్పందించాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ఈ కొత్త ఉద్యమాన్ని కొట్టిపారేస్తూ.. "ఇది కేవలం పాత సినిమాను కొత్త పేరుతో రీ-రిలీజ్ చేయడమే" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఏదేమైనా, అన్నామలై బీజేపీ నుంచి బయటకు వచ్చి 24 గంటలు కూడా గడవకముందే 14 లక్షల సభ్యత్వాలను సాధించడం.. తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే, విజయ్ టీవీకే పార్టీల మధ్య సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపింది.

# ఉదయాన్నే బ్రష్ చేయొద్దు బోలెడు లాభాలు మిస్



మార్నింగ్ లేవగానే బ్రష్ చేయడం అందరికీ అలవాటు. కానీ ఉద్దేశపూర్వకంగానే ఈ పద్ధతిని మానుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. మనం రాత్రి పడుకున్నాక ఉత్పత్తి అయ్యే లాలాజలంలో విటమిన్ బి12 ఉంటుంది. ఈ విటమిన్ ను శరీరం తయారు చేయదు. కాబట్టి ఆహారం లేదా సప్లిమెంట్స్ ద్వారా తీసుకోవాల్సిన అవసరం ఉంది. దానికి బదులు ఉదయం పూట బ్రష్ చేసేకు ముందే.. నిద్ర లేవగానే నీళ్లు తాగితే ఆ లాలాజలంలోని విటమిన్ బి12 ను చిన్న ప్రేగు శోషించుకుంటుంది అంటున్నారు నిపుణులు. దీనివల్ల దంతక్షయం, దంత సమస్యలు దరిచేరవని సూచిస్తున్నారు. నోటి పుండ్లను నివారించడం, చిగుళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం నుంచి నోటి కణజాల సమగ్రత, నరాల పనితీరు, హృదయనాళ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడం వరకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. రక్త కణాలను ఏర్పరచడంలో, డిఎన్ఏ సృష్టి, జీవక్రియకు సహాయపడుతుంది.

## అంతరించిపోతున్న పక్షి జాతి కోసం 50 కోట్లు ఖర్చు

**అత్యంత అరుదైన పక్షి 'కలివికోడి' సంరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కృషి**

**కొండూరు సమీపంలో 3 వేల ఎకరాల్లో అభయారణ్యం ఏర్పాటు**

**తొలిసారిగా 1848లో పెన్నా నది పరీవాహక ప్రాంతంలో గుర్తింపు**



అంతరించిపోతున్న ఓ పక్షి జాతిని సంరక్షించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్నాయి. ఏకంగా 3 వేల ఎకరాల్లో అభయారణ్యం ఏర్పాటు చేశాయి. ఎనభైలలోనే అంతరించిపోయిందనుకున్న పక్షి 'కలివికోడి' కోసం తిరుపతి ఎస్వీయూ పరిశోధకుల బృందం నాలుగేళ్ల పాటు అన్వేషణ జరిపింది. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు ప్రాంతంలోని లంకమలలో 2002లో ముంబయి నేచురల్ హిస్టరీ సొసైటీ ఈ పక్షి పాదముద్ర, కూతను రికార్డు చేసింది. జిల్లాలోని కొండూరు సమీపంలోని చిట్టడవుల్లో ఈ పక్షుల జాడ కనిపించడంతో ప్రభుత్వం అక్కడ 3 వేల ఎకరాల్లో శ్రీలంకమల్లేశ్వర అభయారణ్యాన్ని ఏర్పాటుచేసింది. అక్కడ కలివికోడి ఉనికిని గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.50 కోట్ల వరకూ వెచ్చించాయి. పక్షి పరిశోధక బృందం సభ్యులు గత జులై, ఆగస్టు నెలల్లో అక్కడ వారాల తరబడి పరిశోధనలు సాగించి ఈ పక్షిని గుర్తించారు. వాటి కూతను రికార్డు చేశారు. కలివికోడి సుమారు 27 సెంటీమీటర్ల పొడవు ఉంటుందని, దీని కూత దాదాపు 200 మీటర్ల దూరం వరకు వినిపిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఎగిరే సామర్థ్యం లేకపోవడంతో కలివికోడి దట్టమైన పొదల్లో నివసిస్తుంటుందని తెలిపారు. పగటిపూట నిద్రించడం, రాత్రిపూట ఆహారం కోసం అన్వేషించడం కలివికోడి లక్షణమని, గులక రాళ్లను సేకరించి వాటి మధ్య గుడ్లు పెడతాయని పేర్కొన్నారు. తొలిసారిగా 1848లో పెన్నా నది పరీవాహక ప్రాంతంలో కలివికోడి కనిపించిందని పరిశోధకులు తెలిపారు. అనంతరం 1985 జనవరి 5న రెడ్డిపల్లె వాసి చిన్న ఐతన్న ఈ పక్షిని పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఆ తర్వాత ఈ జాతి అంతరించిపోయినట్లు పక్షిశాస్త్ర నిపుణులు చెబుతూ వచ్చారు.

## ప్రొటీన్ పౌడర్ వాడుతున్నారా

**ఈ 4 జాగ్రత్తలు మీకోసమే!**

**ప్రొటీన్ పౌడర్ వాడే ముందు నిపుణుల కీలక సూచనలు**



కండరాల బలం కోసం, పోషకాహార లోపాన్ని అధిగమించడం కోసం ప్రొటీన్ పౌడర్ వాడకం ఇటీవల బాగా పెరిగింది. అయితే, ఎలాంటి ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోకుండా వీటిని వాడటం సరికాదని, అది అందరికీ మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రొటీన్ సప్లిమెంట్లు తీసుకునే ముందు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం గురించి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు వేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా శాకాహారులు తమ ఆహారం ద్వారా తగినంత ప్రొటీన్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇలాంటి వారు సప్లిమెంట్లపై ఆధారపడటానికి ముందు తమ శరీర యంత్రాంగం అందుకు సిద్ధంగా ఉందో లేదో చూసుకోవాలలి. ప్రొటీన్ పౌడర్ వాడకానికి ముందు నాలుగు కీలక అంశాలను తప్పక పరిశీలించుకోవాలి.

1. జీర్ణవ్యవస్థ: మీరు తినే ఆహారం సరిగ్గా జీర్ణమవుతోందా? మలబద్ధకం, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఏమైనా ఉన్నాయా? జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే అదనపు ప్రొటీన్‌ను శరీరం తట్టుకోగలదు.

2. మూత్రపిండాల పనితీరు: గతంలో కిడ్నీలో రాళ్లు లేదా ఇతర సమస్యలు ఉన్నాయా? ఎక్కువ ప్రొటీన్ తీసుకోవడం వల్ల కిడ్నీలపై భారం పెరుగుతుంది. కాబట్టి, వాడకానికి ముందు కిడ్నీ ఫంక్షన్ టెస్ట్ చేయించుకోవడం మంచిది.

3. కాలేయ ఆరోగ్యం: ఫ్యాటీ లివర్ లేదా కాలేయ సంబంధిత సమస్యలు ఉన్నవారు ముందుగా వాటికి చికిత్స తీసుకోవాలి. ఎందుకంటే, ప్రొటీన్‌లోని అమైనో ఆమ్లాలను విడగొట్టేది కాలేయమే.


4. శరీరంలో నీటి శాతం: ప్రొటీన్ జీవక్రియకు ఎక్కువ నీరు అవసరం. రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తాగకపోతే డీహైడ్రేషన్, కిడ్నీలపై ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి.

చాలామంది ఎలాంటి అవగాహన లేకుండానే సప్లిమెంట్లు మొదలుపెడుతున్నారని, దీనివల్ల సరైన ఫలితాలు రాకపోగా ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ప్రొటీన్ పౌడర్లలో హానికర లోహాలు, చక్కెరలు కూడా ఉండే అవకాశం ఉందని, వీలైనంత వరకు సహజ ఆహారం ద్వారా ప్రొటీన్ పొందడమే ఉత్తమమని వారు సూచిస్తున్నారు. సప్లిమెంట్లు వాడాలనుకుంటే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి.

# 'కళ్లు తిరగడం, తలనొప్పి'గా ఉంటోందా

**మీరూ ఈ తప్పు చేస్తున్నారేమో చెక్ చేసుకోండి!**

**డీహైడ్రేషన్ లక్షణాలు - రోజుకు ఎంత వాటర్ తాగాలి?**




శరీరానికి తగినంత నీరు అవసరమని డాక్టర్లు పదేపదే చెబుతుంటారు. రోజుకు కనీసం 1.5 నుంచి 2 లీటర్లు నీళ్లు తాగాలంటున్నారు. కానీ, ఈ ఉరుగులు, పరుగుల జీవితంలో చాలామంది ఈ విషయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. దీంతో డీహైడ్రేషన్‌కు గురవ్వడం, శరీర అవయవాల పనితీరు మందగించడం తదితర సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారు. అయితే డీహైడ్రైషన్‌కు గురైనప్పుడు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

**నిరంతర అలసట :** చాలా మంది రాత్రిళ్లు బాగా నిద్రపోయినప్పటికీ.. ఉదయం అలసటగా ఫీల్ అవుతుంటారు. అందుకు శరీరంలో నీటి శాతం తక్కువగా ఉండడమే కారణం అంటున్నారు నిపుణులు. నీరు తగ్గినప్పుడు రక్త పరిమాణం తగ్గుతుందని చెబుతున్నారు. దీనివల్ల ఆక్సిజన్, పోషకాలను సరఫరా చేయడానికి గుండె మరింత కష్టపడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

**నెమ్మదిగా మొదలయ్యే తలనొప్పి :** శరీరంలో నీటి శాతం తగ్గిపోయినప్పుడు, మెదడు కణజాలం తాత్కాలికంగా కుంచించుకుపోవచ్చంటున్నారు నిపుణులు. దీనివల్ల ఏర్పడే ఒత్తిడి మార్పులు తలనొప్పికి దారితీస్తుందని పేర్కొంటున్నారు. అయితే, నీరు సరిగా తాగడం వల్ల ఇలాంటి తలనొప్పులు తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరం డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు తలనొప్పి, అలసట, ఆకలి లేకపోవడం లేదా చక్కెర తినాలనే కోరిక, కండరాల తిమ్మిరి, మలబద్ధకం లాంటి లక్షణాలు కనిపిస్తాయని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఅఅఎ అధ్యయనం పేర్కొంది.

**పొడిబారిన చర్మం :** చర్మం మన శరీరంలో అతిపెద్ద అవయవం. డీహైడ్రేషన్‌గా ఉన్నప్పుడు చర్మం కాంతివిహీనంగా లేదా తక్కువ సాగే గుణంతో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై చిన్న చిన్న గీతలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొంటున్నారు.

**ముదురు రంగు మూత్రం :** మూత్రం రంగు మన ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తుంది. లేత గడ్డి రంగులో ఉంటే హైడ్రేషన్‌గా ఉన్నట్లు, ముదురు పసుపు రంగులో ఉంటే శరీరానికి మరిన్ని ద్రవాలు అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు.

**మలబద్ధకం :** జీర్ణక్రియ సాఫీగా సాగడానికి నీరు చాలా ముఖ్యం. శరీరంలో తగినంత నీరు లేనప్పుడు, వ్యర్థాల నుంచి పేగులు నీటిని పీల్చుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మలం గట్టిపడి మలబద్ధకం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

**అకస్మాత్తుగా తీపి పదార్థాలు తినాలనిపించడం :** తీపి కోరికలు ఎప్పుడూ ఆకలి వల్లనే కలగవు. కాలేయం శక్తి కోసం గ్లూకోజ్‌ను విడుదల చేయాలంటే నీరు అవసరం. హైడ్రేషన్ తగ్గినప్పుడు ఈ ప్రక్రియ మందగిస్తుందంటున్నారు నిపుణులు. దీంతో మెదడు చక్కెర అవసరమని తప్పుగా అర్థం చేసుకుంటుందని చెబుతున్నారు.

**కండరాల తిమ్మిర్లు, కళ్లు తిరగడం :** సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత నీటిపై ఆధారపడి ఉంటుంది. నీరు లేకపోతే కండరాలు సులభంగా తిమ్మిర్లకు గురవుతాయంటున్నారు నిపుణులు. అలాగే, త్వరగా లేచి నిలబడినప్పుడు కళ్లు తిరిగినట్లు అనిపించవచ్చని వివరిస్తున్నారు.

**ఎంత నీరు తాగాలి:** శరీరానికి ఎంత నీరు అవసరమనేది.. వయస్సు, వాతావరణం, శ్రమను బట్టి మారుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా పెద్దలు రోజుకు 2 నుంచి 3 లీటర్ల ద్రవాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్థిరమైన శక్తి, లేత రంగు మూత్రం, క్రమబద్ధమైన మూత్ర విసర్జన వంటివి మీరు తగినంత హైడ్రేటెడ్‌గా ఉన్నారని చెప్పే స్పష్టమైన సంకేతాలని తెలియజేస్తున్నారు. మాములుగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని అధ్యయనం పేర్కొంది.

# ఇన్ఫెక్షన్లు, జబ్బులు రాకుండా ఉండాలంటే..!

చక్కని మట్టివాసన, స్వచ్ఛమైన, చల్లటి గాలులు...మొత్తానికి వర్షాకాలం వచ్చేసింది. దీంతో మండే ఎండలనుంచి భారీ ఊరట లభించింది. కానీ వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు, పెద్దవారి ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలి. ఎందుకంటే హాయినిచ్చే చిరుజల్లులే జలుబు, జ్వరం, అలెర్జీలు , ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని కూడా మోసుకొస్తాయి. ఆహారం, నీరు కలుషితమయ్యే అవకాశాలూ ఎక్కువే. అందుకే రోగ నిరోధక శక్తిని పెంచే, పోషకాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలి. అవేంటో చూద్దాం రండి.

వర్షాకాలంలో వాతావరణం తేమగా ఉంటుంది. ఫలితంగా వ్యాధికారక క్రిములు చెలరేగే అవకాశం ఉంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ ప్రభావితమవుతంది. తేమ గట్‌లో హానికరమైన బ్యాక్టీరియా , శిలీంధ్రాల పెరుగుదలను కూడా పెంచుతుంది. ఇది గట్ ఫ్లోరాకు అంతరాయం కలిగిస్తుంది. ఇన్ఫెక్షన్లు చుట్టుముట్టుతాయి. కలుషితమైన ఆహారం, నీరుతో రోగాలు ప్రబలుతాయి. సాధ్యమైనంతవరకు ఈ సీజన్‌లో కాలి చల్లార్చిన నీళ్లను తాగాలి. ఆహారాలను కూడా వేడి వేడిగా తినడం ఉత్తమం. వంట ఇంట్లో సులభంగా లభించే పదార్థాలతో ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చు. పసుపు :మన నిత్యం ఆహారంలో పసుపును చేర్చుకోవాలి. ఇందులోని కర్క్యుమిన్ శక్తి వంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి,అలెర్జీ రాకుండా కాపాడుతుంది. అల్లం: యాంటీ ఇన్ఫ్లమేటరీ ,యాంటీ మైక్రోబయల్ ఏజెంట్ అంది. ఇది జీర్ణక్రియకు సహాయప డుతుంది. వాపును తగ్గిస్తుంది. శ్వాసకోశ సమస్యలతో పోరాడటానికి సహాయ పడుతుంది. వెల్లుల్లి: యాంటీ బయాటిక్, యాంటీవైరల్ లక్షణాల పవర్‌హౌస్ వెల్లుల్లి. రోగనిరోధక వ్యవస్థను బలప రుస్తుంది, జలుబు, దగ్గు, ఇతర ఇన్‌ఫెక్షన్లను నివారిం చడంలో సాయ పడుతుంది. పెరుగు : ప్రోబయెాటిక్స్‌తో నిండిన పెరుగు మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ఆరోగ్య కరమైన గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచి జీర్ణశయాంతర ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. కాకరకాయ:కాకర యాంటీ మైక్రోబయల్లక్షణాలు జీర్ణవ్యవస్థను శుభ్రపరుస్తాయి. రక్తంలో చక్కెర నిర్వహణలో సహాయపడతాయి అలాగే ఈ సీజన్‌లోలభించే బీర,సొర లాంటి తీగ జాతి కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.



తాజా ఆకుకూరలు : తోటకూర, బచ్చలికూర, పాలకూర తదితర ఆకుకూరలనుఎక్కువగా తీసుకోవాలి. విటమిన్లు, ఖనిజాలు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి,ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

సిట్రస్ పండ్లు: రోగ నిరోధక శక్తిని పెంచే సిట్రస్ పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. నారింజ, నిమ్మలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. కీలకమైన రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

తులసి: ఆయుర్వేదంలో తులసి ఔషధ గుణాలకు అపారమైన ప్రాముఖ్యత ఉంది. రోగ నిరోధక శక్తిని పెంచే సామర్థ్యాలతో పాటు , తులసి చికాకు కలిగించే అలెర్జీ లక్షణాలతో పోరాడుతుంది. తాజా తులసి ఆకులను నమలవచ్చు. లేదా టీలో నాలుగు తులసి ఆకులు వేసుకున్నా మంచిదే. ముఖ్యంగా చిన్నపిల్లలకు కొద్దిగా అల్లం, తులసి ఆకులతో మరగించిన నీళ్లకు కొద్దిగా తేనె కలిపి తాగిస్తే మంచిది.

వీటితో పాటు చల్లని వాతావరణానికి దూరంగా ఉండాలి. పిల్లలు, పెద్దవాళ్లు చలినుంచి కాపాడే ఉలెన్ దుస్తులు వాడాలి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

# ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరు ఈ ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతున్నారు"



చాలా మందిలో, ఫ్యాటీ లివర్ సమస్యలు మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు మరియు అనేక ఇతర వ్యాధుల ముందు ఉంటాయి. ఫ్యాటీ లివర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి. దీని వల్ల చాలా ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయి. భారత్‌లో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తోంది. భారతీయుల్లో ముగ్గురిలో ఒకరికి ఫ్యాటీ లివర్ వ్యాధి ఉంది. ఈ విషయాన్ని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇటీవల ఓ సదస్సులో తెలిపారు. నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ అనేది సాధారణ జీవక్రియ కాలేయ రుగ్మత అని నిపుణులు చెబుతున్నారు, ఇది తరువాత సిర్రోసిస్ మరియు ప్రైమరీ లివర్ క్యాన్సర్‌గా మారుతుంది. చాలా మందిలో, ఫ్యాటీ లివర్ సమస్యలు మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు మరియు అనేక ఇతర వ్యాధుల ముందు ఉంటాయి.

### కొవ్వు కాలేయం అంటే ఏమిటి?.....

శరీరంలో ప్రోటీన్, లిపిడ్ మరియు బిలిరుబిన్‌లను నియంత్రించడానికి కాలేయం పనిచేస్తుంది. ఆహారంలో ఎక్కువ కొవ్వు మరియు కేలరీలు తీసుకోవడం మరియు తక్కువ శారీరక శ్రమ చేయడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది, దీనిని ఫ్యాటీ లివర్ అంటారు. ఈ సమస్య మద్యపానం చేసేవారిలోనే కాకుండా అధిక బరువు మరియు %దీవీ×% ఉన్న తాగనివారిలో కూడా ఎక్కువగా ఉంటుంది.

### ఫ్యాటీ లివర్ పెరగడానికి కారణాలు....

భారత్, యూరప్ దేశాల్లో జీవనశైలి, ఆహారంలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయని, వీటి కారణంగా మధుమేహం, ఊబకాయం వంటి మెటబాలిక్ సిండ్రోమ్స్ పెరుగుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దీని కారణంగా, నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి కేసులు కూడా పెరుగుతున్నాయి. తక్కువ బరువు ఉన్న వ్యక్తులు కూడా ఎక్కువ ప్రమాదంలో ఉన్నారు. నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ మరియు ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ స్టీటోసిస్ నుండి స్టీటోహెపటైటిస్ సిర్రోసిస్ మరియు హెచ్‌సిసి వరకు ఒకే విధమైన ప్రభావాలను చూపుతాయి. భారతదేశంలో, ఈ వ్యాధి చాలా తక్కువ బరువు ఉన్నవారిలో దాదాపు 20% మందిలో సంభవిస్తుంది, అయితే పాశ్చాత్య దేశాలలో, నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి యొక్క చాలా సందర్భాలలో ఊబకాయానికి సంబంధించినవి. మీ ఆహారంలో కొవ్వు మరియు కార్బోహైడ్రేట్‌లను తగ్గించండి., శారీరక శ్రమను పెంచండి., కొవ్వు కాలేయాన్ని తగ్గించడం గురించి మీ డాక్టర్‌తో మాట్లాడండి.

# మీ పేరు మీద ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో చెక్ చేసుకోండి లేకుంటే మీకు భారీ జరిమానా తప్పదు..




హైదరాబాద్: ప్రభుత్వం ప్రతి ఐదేళ్లలో ప్రజలకు ఏదో ఒక మెలిక పెడుతోంది. ఇప్పుడు తాజాగా సిమ్ కార్డుల పరిమితిపై దృష్టి సారించింది. గతంలో గుర్తింపు కార్డు ఏదో ఒకటి ఉంటే సరిపోయేది. తర్వాత రాను రాను నియమాలు పెంచేశారు. గతంలో రెసిడెన్స్ సర్టిఫికేట్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్, ఇన్కమ్ సర్టిఫికేట్, కేస్ట్ సర్టిఫికేట్ ఇలా ఉంటుండేవి. వాటి తర్వాత రేషన్ కార్డు, ఓటర్ కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు అంటూ నియమాలు పెంచేశారు. ఇప్పుడు తాజాగా మీకు ఎన్ని సిమ్ కార్డులు ఉండాలో ఆంక్ష పెడుతున్నారు. అసలు టెలికామ్ చట్టం ఏమి చెబుతోంది? ఒక వ్యక్తి (జమ్మూకశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాలు తప్పించి) ఏ రాష్ట్ర పౌరుడైనా తన పేరిట తొమ్మిది వరకు సిమ్ కార్డులు కలిగి ఉండొచ్చని నియమం ఉంది. కొత్త టెలికామ్ చట్టం 2023 ప్రకారం నిర్ధారించిన దానికన్నా ఎక్కువ సిమ్ కార్డులు ఉంటే బాధ్యుడిని చేస్తారు. మీరు ఆరు లేక తొమ్మిది కన్నా ఎక్కువ సిమ్ కార్డులను కలిగి ఉంటే మీరు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. మొదటి సారి చేసే అపరాధానికి రూ. 50000 పెనాల్టీ, తర్వాత అదే తప్పు చేస్తే రూ.200000 వరకు పెనాల్టీ పెరుగుతుంది. ప్రస్తుతానికి సిమ్ కార్డులపై పరిమితి ఖచ్చితంగా ఆచరించనప్పటికీ, మోసపూరితంగా సిమ్ కార్డులు తీసుకుంటే మూడేళ్ల జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమాన పడే అవకాశం ఉంది. నిర్ణీత పరిమితికి మించి మీరు సిమ్ కార్డులు కలిగి ఉంటే, లేదా మీ పేరిట వేరే వారు సిమ్ కార్డులు తీసుకున్నా మీరు భాధ్యులు కావొచ్చు. మీ పేరిట ఎన్ని సిమ్ కార్డులున్నవి ట్రాక్ చేసుకోండి. మీ పేరు మీద వేరే వారు సిమ్ కార్డు తీసుకుని మోసపూరిత వ్యవహారాలకు ఉపయోగిస్తే%శా%మీకు ముప్పు రావొచ్చు. అందుకనే మీ పేరిట ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయన్నది చెక్ చేసుకోండి. అందుకు మీరు 'సంచార్ సాథీ' స్టెప్ అనే పోర్టల్ కు వెళ్లి అప్పుడప్పుడు చెక్ చేసుకోవాలి. సంచార్ సాథీ పోర్టల్ మీ ఆధార్ కార్డుతో ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో చూపుతుంది. దానిలో మీకు మూడు ఆప్షన్లు కనిపిస్తాయి- అవి: 'నాట్ మై నంబర్', 'నాట్ రిక్వయిర్డ్', 'రిక్వయిర్డ్' అని మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు మీకు కావలసిన ఆప్షన్ పై క్లిక్ చేయాల్సి ఉంటుంది. తన పేరిట తొమ్మిది కన్నా ఎక్కువ సిమ్ కార్డులున్న వారు రీ-వెరిఫికేషన్ చేసుకోవలసి ఉంటుంది. మీ మొబైల్ నంబర్ రీ-వెరిఫికేషన్ కోసం ఫ్లాగ్ అయి ఉంటే మీరు మూడు ఆప్షన్లలో ఏదో ఒకటి చేయాల్సి ఉంటుంది. ఆ మూడు ఆప్షన్లు: సరెండర్/ ట్రాన్స్ ఫర్/ డిస్ కనెక్షన్. నిర్ధారిత సంఖ్య కన్నా ఎక్కువ సిమ్ కార్డులు ఉంటే మీకు నోటీస్ రావొచ్చు. నోటీసు రాక ముందే మీరు మీ పరిమితిలో ఉంటే మీకు ఎలాంటి పెనాల్టీ పడదు. కానీ నోటీసు వచ్చిందో పెనాల్టీ తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కనుక తస్మాత్ జాగ్రత్త!

# సామాన్యులకు షాక్! భారీగా పెరిగిన వంట గ్యాస్ ధర

**మూడు నెలల్లోనే రెండోసారి**

**దేశవ్యాప్తంగా మరోసారి పెరిగిన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర**

**రూ.29 మేర పెరిగిన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర-మూడు నెలల వ్యవధిలో రెండోసారి పెరిగిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర**



పశ్చిమాసియా ఘర్షణలు సామాన్యుడిపై మరోసారి ధరల భారాన్ని మోపాయి. గృహ అవసరాలకు వినియోగించే 14 కిలోల గ్యాస్ సిలిండర్ ధరను రూ.29 పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. హోటళ్లు, రెస్టారెంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వాడే కమర్షియల్ 19 కిలోల సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. తాజా పెంపుతో దేశవ్యాప్తంగా వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడనుంది.ఈ తాజా పెంపుతో దిల్లీలో డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 నుంచి రూ.942 చేరింది. మార్చి 7న సిలిండర్‌పై ఏకంగా 60 రూపాయలు పెంచిన చమురు సంస్థలు, కేవలం 3 నెలల వ్యవధిలోనే మళ్లీ ధరలను పెంచడం గమనార్హం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాకు విఘాతం కలిగింది. ప్రపంచ మార్కెట్‌లో క్రూడాయిల్, ఇంధన ధరలు భారీగా పెరిగాయి. మార్చిలో జరిగిన పెంపు తర్వాత కేవలం మూడు నెలల వ్యవధిలోనే మరోసారి ధరలు పెరగడం వినియోగదారుల్లో ఆందోళనకు కారణమైంది.ఇక ఎల్‌పీజీ అందుబాటుపై కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. అంతర మంత్రిత్వశాఖల సమావేశంలో మీడియాతో మాట్లాడిన ఆమె, దేశీయ ఉత్పత్తిని పెంచడమే కాకుండా అవసరమైన మేర దిగుమతులు కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. దేశంలో గ్యాస్ కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు అమలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల విషయంలో ప్రభుత్వంపై ఇంకా గణనీయమైన భారం కొనసాగుతోందని సుజాత శర్మ వెల్లడించారు. ప్రస్తుతం ఒక్క గృహ వినియోగ సిలిండర్‌పై దాదాపు రూ.700 మేర అండర్ రికవరీ (నష్ట భారం) ఉన్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరల మార్పులు, దిగుమతి వ్యయాలు పెరగడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి కొనసాగుతోందని ఆమె వివరించారు.ఇటీవలి కాలంలో ఎల్‌పీజీ డిమాండ్ కొంత మేర తగ్గినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని అధికారులు వివరించారు. మొదటిగా వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ఎల్‌పీజీ వినియోగం తగ్గడం ప్రభావం చూపిందన్నారు. రెండోది బుకింగ్ వ్యవధిని 25 రోజుల నుంచి 45 రోజుల వరకు సమర్థవంతంగా నిర్వహించడం వల్ల అవసరానికి మించి బుకింగ్‌లు తగ్గాయని చెప్పారు. మూడోది డెలివరీ ఆథెంటికేషన్ కోడ్ (డీఏసీ) విధానాన్ని అమలు చేయడం ద్వారా సరైన లబ్ధిదారులకే సిలిండర్లు చేరుతున్నాయని, దీనివల్ల వ్యవస్థలో పారదర్శకత పెరిగిందని వెల్లడించారు.తాజా ధరల పెంపుతో కుటుంబాల నెలవారీ ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలపై ఈ నిర్ణయం అదనపు భారంగా మారనుంది. అయితే అంతర్జాతీయ పరిస్థితులు, దిగుమతి వ్యయాలు, ప్రభుత్వ భారం వంటి అంశాల దృష్ట్యా ధరల సవరణ తప్పనిసరి అయిందని ఇంధన రంగ వర్గాలు చెబుతున్నాయి.ఎల్‌పీజీ సిలిండర్ అసలు ధరలను తెలుసుకోవాలనుకుంటే ఇండియన్ ఆయిల్ అధికారిక వెబ్‌సైట్ చూడవచ్చు. ఇదే వెబ్‌సైట్‌లో ఎల్‌పీజీ ధరలతోపాటు, జెట్ ఫ్యూయెల్, ఆటో గ్యాస్, కిరోసిన్ మొదలైన ఇంధనాల ధరలను కూడా తెలుసుకోవచ్చు.

## మళ్లీ నంబర్ 1 స్థానానికి చేరిన అదానీ



అంబానీ రికార్డ్ బ్రేక్! బిజినెస్ ప్రపంచంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం. తాజాగా భారతీయ వ్యాపార దిగ్గజం, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మరోసారి సంచలనం సృష్టించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీని, సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషి సన్‌ను వెనక్కి నెట్టి.. ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా మళ్లీ తన పాత కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఫోర్బ్స్ రియల్-టైమ్ బిలియనీర్స్ నివేదిక ప్రకారం.. అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు విపరీతంగా పెరగడంతో గౌతమ్ అదానీ సంపద భారీగా పెరిగింది. ఈ రేసులో జపాన్‌కు చెందిన మసయోషి సన్ కంపెనీ షేర్లు ఒక్కసారిగా పడిపోవడంతో అదానీ నంబర్ 1 స్థానానికి దూసుకెళ్లారు. ముగ్గురు ధనవంతుల నెట్ వర్త్ ఎంతంటే ప్రస్తుతం ఆసియా టాప్ 3 కుబేరుల ఆస్తి వివరాలు ఇలా ఉన్నాయి.. గౌతమ్ అదానీ: 89.2 బిలియన్ డాలర్లు ముఖేష్ అంబానీ: 88 బిలియన్ డాలర్లు మసయోషి సన్: 87 బిలియన్ డాలర్లు కేవలం శుక్రవారం ఒక్కరోజే అదానీ ఆస్తి ఏకంగా 2.5 బిలియన్ డాలర్లు పెరగడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఆ రోజు అత్యధికంగా సంపాదించిన వారిలో వారెన్ బఫెట్ (3 బిలియన్ డాలర్లు) తర్వాత స్థానం అదానీదే కావడం గమనార్హం. రాకెట్‌లా దూసుకెళ్లిన అదానీ గ్రూప్ షేర్లు! గత కొన్ని రోజులుగా అదానీ గ్రూప్ స్టాక్స్ మార్కెట్‌లో దుమ్మురేపుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది 2026 లో ఈ షేర్లు 23% నుండి 56% వరకు లాభాలను ఇచ్చాయి. రీసెంట్‌గా జరిగిన ట్రేడింగ్‌ల అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు దాదాపు 7% పెరిగాయి. అదానీ ఎనర్జీ షేర్లు 4% వరకు జంప్ చేశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ చెరో 2% లాభపడ్డాయి. అదానీ పవర్ కూడా 1% పైగా పెరిగింది. ఆ వివాదాల నుంచి బయటపడటంతోనే.. గత నెలలో అదానీ గ్రూప్‌పై ఉన్న ఫ్రాడ్ కేసులను అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ కొట్టేసింది. సోలార్ ఎనర్జీ కాంట్రాక్టుల కోసం రూ.250 మిలియన్ డాలర్ల లంచం ఇచ్చారనే ఆరోపణలు రావడంతో ఇన్వెస్టర్లు భయపడ్డారు. కానీ ఆ కేసుల నుంచి క్లీన్ చిట్ రాగానే అదానీ సంపద ఏకంగా 10 బిలియన్ డాలర్లు పెరిగింది. అంతకుముందు 2023 లో హిండెన్‌బర్గ్ అనే అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ చేసిన ఆరోపణలను కూడా మన దేశ రెగ్యులేటర్లు కొట్టేసి, ఆ ఆరోపణల్లో నిజం లేదని తేల్చారు. దాంతో అదానీ కంపెనీలపై ఇన్వెస్టర్లకు నమ్మకం మరింత పెరిగింది. ప్రపంచంలో ఎవరి స్థానం ఎక్కడ ప్రస్తుత ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ 23వ స్థానంలో ఉన్నారు. ఆయన వెనుకే అంబానీ, మసయోషి సన్ ఉన్నారు. ఇక ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఎలాన్ మస్క్ 800 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపదతో మొదటి స్థానంలో కొనసాగుతున్నారు. ఈయన ఆస్తి రెండో స్థానంలో ఉన్న గూగుల్ కో-ఫౌండర్ లారీ పేజ్ కంటే రెండింతలు ఎక్కువగా ఉండటం విశేషం. ఏదేమైనా.. ఎన్ని కష్టాలు, ఆరోపణలు ఎదురైనా వాటన్నింటినీ తట్టుకుని అదానీ మళ్లీ నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం బిజినెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# రూపాయి పతనంపై కేంద్రం సర్జికల్ స్ట్రైక్

**అర్ధరాత్రి భారీ నిర్ణయం! అదేంటంటే**



ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ కొన్ని గ్లోబల్ టెన్షన్ల వల్ల ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఈ ఏడాదే 6 శాతానికి పైగా పడిపోయింది. మరోవైపు ఇరాన్ యుద్ధ వాతావరణం వల్ల క్రూడాయిల్ ధరలు మండిపోతున్నాయి. వీటన్నింటికీ తోడు విదేశీ ఇన్వెస్టర్లు మన స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ. 2.25 లక్షల కోట్ల నుండి రూ. 2.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులను వెనక్కి తీసేసుకున్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు మోదీ సర్కార్ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. విదేశీ ఇన్వెస్టర్లకు ఊరటనిస్తూ ఆదాయపు పన్ను చట్టాన్ని సవరిస్తూ కేంద్ర కేబినెట్ ఒక అత్యవసర ఆర్డినెన్స్‌ను ఆమోదించింది.భారత ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెట్టే విదేశీ ఇన్వెస్టర్లపై ఉన్న 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ను కేంద్రం పూర్తిగా రద్దు చేసింది. పార్లమెంట్ సమావేశాల వరకు ఆగకుండా, ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలనే ఉద్దేశంతో ఆర్డినెన్స్ రూట్‌ను ఎంచుకుంది. రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే ఇది అమల్లోకి వస్తుంది.ఇంతే కాకుండా, ఈ బాండ్ల ద్వారా విదేశీయులకు వచ్చే వడ్డీ ఆదాయంపై ఉన్న 20% విత్‌హోల్డింగ్ ట్యాక్స్ ను కూడా ప్రభుత్వం తొలగించబోతున్నట్లు సమాచారం. దీనివల్ల విదేశీ ఇన్వెస్టర్లకు టాక్స్ పోగా మిగిలే లాభాలు భారీగా పెరుగుతాయి.ఈ టాక్స్ బ్రేక్ ఇప్పుడెందుకుమన మార్కెట్లలో సాధారణంగా విదేశీయులు షార్ట్-టర్మ్ (స్వల్పకాలిక) లాభాల కోసం స్టాక్స్ కొంటుంటారు. మార్కెట్ కొంచెం అటూ ఇటూ అవ్వగానే ఆ డబ్బును వెనక్కి తీసేసుకుంటారు. దీనివల్ల రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది.అదే ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెడితే ఆ డబ్బు ఎక్కువ కాలం దేశంలోనే ఉంటుంది. అందుకే విదేశీయులు మన ప్రభుత్వానికి అప్పుగా ఇచ్చే ఈ బాండ్ల పెట్టుబడులపై పన్నును తీసేశారు. దీనివల్ల భారీగా విదేశీ నిధులు ఇండియాకు వస్తాయి. తద్వారా రూపాయి మరింత పడిపోకుండా బలం పుంజుకుంటుంది.బడ్జెట్ నిర్ణయంపై కేంద్రం యూ-టర్న్!నిజానికి 2023 లోనే ప్రభుత్వం ఈ పన్ను మినహాయింపులను తీసేసి పన్ను పెంచింది. ఆ తర్వాత రీసెంట్ బడ్జెట్‌లో కూడా చాలా ఆస్తులపై 10 శాతం నుండి 12.5 శాతానికి పెంచారు. కానీ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ నిధులు చాలా అవసరం కావడంతో ప్రభుత్వం తన పాత నిర్ణయాన్ని మార్చుకుని ఈ సంచలన యూ-టర్న్ తీసుకుంది.ఈ మాస్టర్ ప్లాన్ వర్కవుట్ అయితే, బ్రెజిల్ లాంటి దేశాల తరహాలోనే ఇండియాలోనూ బాండ్ మార్కెట్ సూపర్ స్ట్రాంగ్ అవుతుంది. గ్లోబల్ మార్కెట్లో ఎలాంటి కుదుపులు వచ్చినా తట్టుకునే శక్తి మన రూపాయికి వస్తుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ బోల్డ్ స్టెప్ భవిష్యత్తులో దేశ ఆర్థిక రంగాన్ని ఏ మలుపు తిప్పుతుందో చూడాలి!

## మీకు పన్ను లేకపోయినా ఐటీ రిటర్న్స్ దాఖలు చేయండి

**లేదంటే ఆ నష్టాలు తప్పవు!**





సాధారణంగా పన్ను పరిమితి లోపు ఆదాయం ఉన్నవారు లేదా పన్ను చెల్లించాల్సిన అవసరం లేనివారు "నేను ఐటీఆర్ ఎందుకు ఫైల్ చేయాలి" అని అనుకుంటారు. కానీ, ఆర్థిక సంవత్సరం 2025-26లో పన్ను సున్నా అయినప్పటికీ ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ చేయడం వల్ల మీరు ఊహించని లాభాలు ఉంటాయి. అసెస్‌మెంట్ ఇయర్ 2026-27 ఫైలింగ్ సీజన్ దగ్గరపడుతున్న వేళ, నిల్ రిటర్న్స్ దాఖలు చేయడం ఎందుకు మంచిదో ఇప్పుడు చూద్దాం.1. టీడీఎస్ రీఫండ్ పొందడానికి ఏకైక మార్గంమీరు పన్ను పరిమితి లోపే సంపాదిస్తున్నా, కొన్నిసార్లు మీ ఆదాయం నుంచి ముందే పన్ను కట్ అవుతుంది . ఉదాహరణకు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ, ఫ్రీలాన్స్ ఆదాయం లేదా డివిడెండ్లపై టీడీఎస్ కోత పడవచ్చు. ఈ డబ్బును ప్రభుత్వం నుంచి తిరిగి పొందాలంటే , మీరు కచ్చితంగా ఐటీఆర్ ఫైల్ చేయాలి. ఐటీఆర్ దాఖలు చేయకపోతే, ఆ రీఫండ్ సొమ్ము మీకు అందదు. కాబట్టి, మీ సొమ్ము మీరు వెనక్కి తెచ్చుకోవడానికి నిల్ రిటర్న్ ఒక సాధనం.2. లోన్లు, క్రెడిట్ కార్డుల కోసం బలమైన ఆధారంమీరు భవిష్యత్తులో హోమ్ లోన్, పర్సనల్ లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసినప్పుడు, బ్యాంకులు గత 2-3 ఏళ్ల ఐటీఆర్ పత్రాలను అడుగుతాయి. ముఖ్యంగా ఫ్రీలాన్సర్లు లేదా స్థిరమైన ఉద్యోగం లేని వారికి ఐటీఆర్ అనేది ఒక నమ్మకమైన ఆదాయ ధృవీకరణ పత్రంగా పనిచేస్తుంది. మీరు క్రమం తప్పకుండా ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారంటే, మీరు ఆర్థికంగా క్రమశిక్షణతో ఉన్నారని, పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని బ్యాంకులకు నమ్మకం కలుగుతుంది. ఇది మీ లోన్ అప్రూవల్ అవకాశాలను పెంచుతుంది.3. విదేశీ వీసా దరఖాస్తు సులభమవుతుందిఅమెరికా, కెనడా, యూకే వంటి దేశాలకు వీసా కోసం దరఖాస్తు చేసినప్పుడు, వారు గత 3 నుండి 5 ఏళ్ల ఐటీఆర్ రికార్డులను అడుగుతారు. మీరు పన్ను చెల్లించకపోయినా, క్రమం తప్పకుండా రిటర్న్స్ ఫైల్ చేయడం వల్ల మీ ఆర్థిక స్థిరత్వం అధికారులకు అర్థమవుతుంది. మీరు చదువు కోసం లేదా ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నప్పుడు, ఈ డాక్యుమెంట్లు మీ అప్లికేషన్‌ను మరింత బలోపేతం చేస్తాయి.ఎలా ఫైల్ చేయాలిపన్ను లేని వారు ఐటీఆర్ ఫైల్ చేయడం ఇప్పుడు చాలా సులభం. ఆదాయపు పన్ను శాఖ అధికారిక పోర్టల్‌లోకి వెళ్లి ' ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. దీని కోసం ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. మీ దగ్గర ఫామ్-16 లేకపోయినా, మీ ఆదాయ వివరాలను స్వయంగా నమోదు చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ అనేది కేవలం పన్ను చెల్లించే వారి కోసమే కాదు.. అది మన ఆర్థిక రికార్డును పటిష్టంగా ఉంచుకోవడానికి ఒక మార్గం. సున్నా పన్ను ఉన్నప్పుడు ఐటీఆర్ ఫైల్ చేయడం అంటే మన ఆర్థిక భవిష్యత్తు కోసం ఒక అడుగు ముందుకేయడమే. ఇది కేవలం పన్ను బాధ్యత కాదు, ఆర్థిక సన్నద్ధత. కాబట్టి, ఈ సీజన్‌లో మీ నిల్ రిటర్న్స్ ను దాఖలు చేయడం మర్చిపోకండి!

# రూ. 12 వేల కోట్ల సామ్రాజ్యం

**ఒక్క తప్పుతో రాత్రికి రాత్రే కుప్పకూలి**

**74 రూపాయలకు అమ్మకం..**



బిలియన్ డాలర్ల సామ్రాజ్యాన్ని నిర్మించడం ఒక ఎత్తు అయితే, దానిని నైతిక విలువలతో నిలబెట్టుకోవడం మరొక ఎత్తు. పద్మశ్రీ పురస్కార గ్రహీత బి.ఆర్.శెట్టి జీవిత ప్రయాణం కూడా అలాంటిదే. సున్నా నుండి మొదలై వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించి, మళ్ళీ అనిశ్చితిలోకి పడిపోయిన ఆయన కథ కార్పొరేట్ ప్రపంచంలో ఒక హెచ్చరికగా నిలుస్తుంది.దాదాపు 12 వేల కోట్ల రూపాయల విలువైన సామ్రాజ్యం కేవలం కొద్ది నెలల్లోనే కుప్పకూలడం, చివరకు దానిలో కొన్ని భాగాలను కేవలం 74 రూపాయలకే విక్రయించాల్సి రావడం ఊహకందని విషయం. పద్మశ్రీ పురస్కార గ్రహీతగా, ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా వెలిగిన , నేడు న్యాయపోరాటాలు, ఆస్తుల స్తంభన వంటి తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నారు.ఈ అసాధారణ ప్రయాణం 1942లో ఉడుపిలో ప్రారంభమైంది. 1942 ఆగస్టు 1న ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శెట్టి.. మణిపాల్ విశ్వవిద్యాలయం నుండి ఫార్మసీ పట్టా పొందిన తర్వాత ఆర్థిక అవసరాల రీత్యా 1973లో అరబ్ దేశాలకు పయనమయ్యారు. ఆ సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అప్పుడిప్పుడే అభివృద్ధి పథంలో పయనిస్తోంది.అక్కడ అడుగుపెట్టిన ఆయన, దేశంలోనే మొట్టమొదటి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా తన వృత్తిని ప్రారంభించి.. మారుమూల ప్రాంతాలకు కూడా మందులను చేరవేసేవారు. 1975లో తన భార్య డాక్టర్ చంద్రకుమారి శెట్టి సహాయంతో "న్యూ మెడికల్ సెంటర్" అనే చిన్న క్లినిక్‌ను ప్రారంభించినప్పుడు, అది ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సంస్థగా ఎదుగుతుందని ఎవరూ ఊహించలేదు.క్రమంగా శెట్టి తన వ్యాపార పరిధిని పెంచుకుంటూ పోయారు. కేవలం వైద్య రంగంలోనే కాకుండా, ప్రవాస భారతీయుల కోసం 'యూఏఈ ఎక్స్ఛేంజ్' ద్వారా ఆర్థిక సేవలను, 'నియోఫార్మా' ద్వారా ఔషధ తయారీని ప్రారంభించి ఒక బహుముఖ సామ్రాజ్యాన్ని సృష్టించారు. 2012లో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన తొలి యూఏఈ ఆరోగ్య సంస్థగా నిలిచినప్పుడు శెట్టి కీర్తి శిఖరాగ్రానికి చేరింది. సుమారు 4 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో, బుర్జ్ ఖలీఫాలో విలాసవంతమైన ఆస్తులతో ఆయన ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరిగా నిలిచారు. అయితే, ఈ వెలుగుల వెనుక అప్పుల చీకటి నిశ్శబ్దంగా పేరుకుపోతోందని ఎవరూ గమనించలేదు.2019 డిసెంబర్‌లో 'మడ్డీ వాటర్స్ రీసెర్చ్' వెలువరించిన ఒక నివేదిక ఈ సామ్రాజ్యం పునాదులను కదిలించింది. చీవీజ హెల్త్ తన ఖాతా పుస్తకాలలో నగదు నిల్వలను తప్పుగా చూపించిందని, పెట్టుబడిదారులకు తెలియకుండా భారీగా అప్పులు చేసిందని ఆ నివేదిక సంచలన ఆరోపణలు చేసింది. దర్యాప్తులో దాదాపు 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 33 వేల కోట్లు) అప్పును సంస్థ దాచిపెట్టినట్లు వెల్లడైంది. మోసపూరిత పత్రాలు, అనధికార రుణాలు బయటపడటంతో కంపెనీ షేర్లు కుప్పకూలాయి. 2020లో శెట్టి తన పదవులకు రాజీనామా చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.ఆ తర్వాత పరిస్థితులు మరింత విషమించాయి. యూకే హైకోర్టు చీవీజని తన ఆధీనంలోకి తీసుకోగా.. అబుదాబి కమర్షియల్ బ్యాంక్ వంటి అనేక బ్యాంకులు వేల కోట్ల నష్టాలను చవిచూశాయి. ఆయన నిర్మించిన ఫినాబ్లర్ వంటి హోల్డింగ్ కంపెనీని అత్యంత తక్కువ ధరకు (కేవలం ఒక డాలర్ వంటి నామమాత్రపు విలువకు) విక్రయించాల్సి వచ్చింది. శెట్టి వ్యక్తిగత ఆస్తులు స్తంభించిపోయాయి.ఆయనపై అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తులు మొదలయ్యాయి. ఇటీవల 2025 అక్టోబర్‌లో దుబాయ్ కోర్టు ఇచ్చిన తీర్పు దీనికి పరాకాష్టగా నిలిచింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు సుమారు 46 మిలియన్ డాలర్లు తిరిగి చెల్లించాలని కోర్టు ఆయనను ఆదేశించింది. ప్రస్తుతం 2026 నాటికి కూడా శెట్టి న్యాయపోరాటాల్లోనే చిక్కుకుని ఉన్నారు. నిన్నటి వరకు వేల కోట్లకు అధిపతిగా ఉన్న వ్యక్తి, నేడు తన ఉనికిని కాపాడుకోవడానికి న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి రావడం విధి వైచిత్రి.నేడు ఎన్ఎంసి హెల్త్ పనిచేస్తున్నప్పటికీ, దాని సృష్టికర్త మాత్రం తన స్వంత సామ్రాజ్యం నుండి దూరమై న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా కష్టపడి నిర్మించిన ఒక సామ్రాజ్యం వ్యాపారంలో పారదర్శకత, పాలన లోపిస్తే పేకమేడలా కూలిపోతుందని బి.ఆర్. శెట్టి కథ మనకు గుర్తుచేస్తుంది. ఇది కేవలం ఒక వ్యక్తి పతనం కాదు, ఒక వ్యవస్థలోని నైతిక వైఫల్యానికి సాక్ష్యం.

## ఇండియన్ రైల్వే మెగా గిఫ్ట్!

**టికెట్ ఇలా బుక్ చేసుకుంటే ఎక్స్ ట్రా డిస్కౌంట్!**


shutterstock.com · 2572764591

భారతీయ రైల్వే తన ప్రయాణికుల కోసం ఒక అద్భుతమైన వార్తను మోసుకొచ్చింది. 'డిజిటల్ ఇండియా'ను ప్రోత్సహించడంతో పాటు, ప్రయాణికులకు తక్కువ ధరకే సేవలు అందించే లక్ష్యంతో కొత్త రాయితీని ప్రకటించింది. దీని కింద, మీరు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటే నేరుగా డిస్కౌంట్ పొందవచ్చు.3% డిస్కౌంట్ ఆఫర్ ఎలా పొందాలి సాధారణంగా రైలు ప్రయాణం చేసే వారు అన్-రిజర్వ్డ్ (జనరల్) టికెట్ల కోసం కౌంటర్ల వద్ద క్యూ కడుతుంటారు. అయితే ఇకపై రైల్ వన్ యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో టికెట్లు బుక్ చేసుకుంటే, టికెట్ ధరపై 3% డిస్కౌంట్ లభిస్తుంది.ఈ రాయితీని పొందడానికి మీరు , డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా పేమెంట్ చేయాల్సి ఉంటుంది.ఈ ఆఫర్ జూలై 14, 2026 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇందులో లభించే సేవలు:రిజర్వ్డ్ & అన్-రిజర్వ్డ్ టికెట్లు: ఒకే చోట అన్ని రకాల బుక్ చేసుకోవచ్చు.ప్లాట్‌ఫారమ్ టికెట్లు: క్యూలో నిలబడకుండా మొబైల్‌లోనే ప్లాట్‌ఫారమ్ టికెట్ పొందవచ్చు.లైవ్ స్టేటస్: రైలు ఎక్కడ ఉందో, ఏ ప్లాట్‌ఫారమ్‌కు వస్తుందో రియల్ టైమ్‌లో తెలుసుకోవచ్చు.స్టేటస్: మీ సీట్ కన్ఫర్మేషన్ వివరాలను సులభంగా చెక్ చేయవచ్చు. రాబోయే కాలంలో ప్రవేశపెట్టబోయే బుల్లెట్ రైళ్లు, అత్యాధునిక వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, ఇప్పుడు " వంటి డిజిటల్ విప్లవాలు భారత రైల్వే రూపురేఖలను పూర్తిగా మార్చబోతున్నాయి. టికెట్ బుకింగ్‌పై అందిస్తున్న ఈ 3% డిస్కౌంట్ వంటి ప్రోత్సాహకాలు సామాన్యుడి జేబుకు భారం తగ్గించడమే కాకుండా, దేశాన్ని డిజిటల్ దిశగా నడిపించడంలో కీలక పాత్ర

# టాలీవుడ్ హీరోయిన్ల పాత్రలపై విమర్శలు.. గట్టి కౌంటర్ ఇచ్చిన నటి ఆషికా రంగనాథ్!



సౌత్ ఇండియన్ కమర్షియల్ సినిమాలలో, ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాలలో హీరోయిన్ల పాత్రల నిడివి, వారి ఎంపికలపై వచ్చే విమర్శలకు ప్రముఖ నటి ఆషికా రంగనాథ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి టాప్ స్టార్స్ సరసన కేవలం భారీ రెమ్యునరేషన్, క్రేజ్ కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని, నటనకు స్కోప్ లేని పాత్రలను గుడ్డిగా ఒప్పుకుంటున్నారని విమర్శకులు చేసే ఆరోపణలను ఆమె తీవ్రంగా తిప్పికొట్టారు. నటీమణులకు మద్దతుగా పరిశ్రమలోని అసలు వాస్తవాలను వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ప్రాధాన్యత లేకుండా పోవడానికి నటీమణులను నిందించడం ముమ్మాటికీ తప్పని, దీని వెనుక సినిమా ఇండస్ట్రీ నడిచే ఒక పెద్ద వ్యాపార వ్యవస్థ ఉందని ఆషికా పేర్కొన్నారు. చాలా మంది హీరోయిన్లకు ఇలాంటి భారీ పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది కేవలం నటనకు సంబంధించిన ఎంపిక మాత్రమే కాదని, తమ కెరీర్‌ను మార్కెట్‌లో నిలబెట్టుకోవడానికి చేసే ఒక వ్యూహాత్మక నిర్ణయమని (హ్రితీఫ్వస్త్రఅఎ స్పష్టం చేశారు. సాధారణంగా పెద్ద కమర్షియల్ చిత్రాలలో హీరోయిన్ పాత్రలు కేవలం యాక్షన్ సీక్వెన్స్‌ల మధ్యలో వచ్చే గ్లామరస్ విరామాలు లాంటివని, హీరోయిన్ స్వంత ఇమేజ్ కంటే హీరో ఎలివేషన్‌ను పెంచేలాగే ఆ పాత్రలను చాలా జాగ్రత్తగా డిజైన్ చేస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే నటీమణులపై అనవసర నిందలు వేయడం ఆపి, ఇప్పటికీ ఇలాంటి గ్లామర్ పాత్రలనే ప్రేక్షకులు ఇష్టపడతారని నమ్ముతున్న మేకర్స్‌ను, ఈ పాతకాలపు వ్యవస్థను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. నటీనటులు ఎప్పుడైనా తమకు వచ్చే అవకాశాల పరిధిలోనే బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తారని, పెద్ద ప్రాజెక్టులలో భాగమవడం ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారని తెలిపారు. ఒక సినిమాలో హీరోయిన్ పాత్ర సరిగ్గా రాయబడకపోతే ఆ తప్పు రచయితలు, దర్శకులదే కానీ.. ఆ పాత్రల్లో నటించిన మహిళలది కాదని ఆషికా రంగనాథ్ చెప్పుకొచ్చారు.




## మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పిన విజయ్ సేతుపతి.. జూన్ 8న 'స్లమ్‌డాగ్' టీజర్

టాలీవుడ్ దర్శకుడు పూరీ జగన్నాథ్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ప్యాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్ర టీజర్ కోసం నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి డబ్బింగ్ పూర్తి చేసినట్లు పూరీ జగన్నాథ్ శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌లో అసలు విషయం ఏంటంటే.. విజయ్ సేతుపతి కేవలం ఒక భాషలోనే కాకుండా ఏకంగా మూడు భాషల్లో (తెలుగు, తమిళం, హిందీ) స్వయంగా డబ్బింగ్ చెప్పారు. ఈ విషయాన్ని పూరీ జగన్నాథ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ, విజయ్ సేతుపతి తన సొంత వాయిస్‌తో మూడు భాషల టీజర్‌కు అద్భుతమైన వాయిస్‌ను అందించారని, ఈ చిత్ర టీజర్‌ను జూన్ 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గతేడాది జూలైలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రేక్షకుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిగా ముగిసిందని, ప్రస్తుతం అన్ని భాషలకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి స్టైలిష్ గాగుల్స్ ధరించి, చేతిలో రక్తం అంటిన కత్తితో, కరెన్సీ నోట్ల పెట్టెల మధ్య నిలబడి ఉన్న లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ భాగస్వామ్యంతో ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటి టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరి పాత్రలు కథను మలుపు తిప్పే విధంగా ఎంతో బలంగా ఉంటాయని సమాచారం. హీరోయిన్ సంయుక్త పాత్ర ఎమోషనల్ గా, నటనకు మంచి స్కోప్ ఉన్నదిగా ఉంటుందని, ఈ పాత్ర పట్ల ఆమె ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.




## సుడిగాలి సుధీర్‌కి జోడీగా బిగ్ బాస్ బ్యూటీ

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'సుధీర్స్ జోకర్' చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'సుధీర్స్ జోకర్' మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## సమాజంలో మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతోంది.. బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్



సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ద్వంద్వ ప్రమాణాలపై, పితృస్వామ్య మనస్తత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురీ దీక్షిత్. ప్రేమ, బంధాల విషయంలో పురుషులను ఒకలా, స్త్రీలను మరోలా చూసే వివక్ష సమాజంలో ఇంకా బలంగా నాటుకుపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురుషుల శృంగార ఎంపికలను సమాజం గొప్పగా చూస్తుందని, అదే సమయంలో మహిళలు అలాంటి ఎంపికలు చేసుకుంటే తప్పుగా చిత్రీకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇది పూర్తిగా పితృస్వామ్య సమాజమని, కాలం మారుతున్నా మొదటి నుంచి ఉన్న ఆ పాత ఆలోచనలే కొనసాగుతున్నాయని విమర్శించారు. పురుషుడికి ఎక్కువ మంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉంటే అతడిని 'క్యాసనోవా' అని పిలుస్తూ గొప్పగా చూస్తారని, అదే ఒక మహిళకు ఎక్కువ మంది బాయ్‌ఫ్రెండ్స్ ఉంటే ఆమెను ఎంతో నెగెటివ్‌గా చూస్తూ రకరకాల పేర్లతో దూషిస్తారని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తన తాజా చిత్రం 'మా బెహన్' సమాజం సృష్టించిన ఇలాంటి సాంప్రదాయ నిబంధనలను, కట్టుబాట్లను బద్దలు కొడుతుందని 59 ఏళ్ల మాధురీ దీక్షిత్ తెలిపారు. ఈ సినిమాలో సమాజం సృష్టించిన ప్రతి నియమాన్ని తాము బ్రేక్ చేశామని, ఆ పాత్రలు చేస్తున్నప్పుడు తాము ఎంతో ఆనందించామని చెప్పారు. ఇందులోని పాత్రలు ఎంతో గందరగోళంగా, నిజ జీవితంలో ఉండే సాధారణ మనుషులకు ఎంతో దగ్గరగా, రిలేటబుల్‌గా ఉంటాయని ఆమె వివరించారు. సురేష్ త్రివేణి దర్శకత్వంలో తెరకెక్కిన 'మా బెహన్' ఒక బ్లాక్ కామెడీ థ్రిల్లర్ చిత్రం. ఇందులో మాధురీ దీక్షిత్‌తో పాటు తృప్తి డిమ్రి, ధరణ దుర్గా, రవి కిషన్, గీతాంజలి కుల్కర్ణి, అరుణోదయ్ సింగ్, శార్దూల్ భరద్వాజ్ కీలక పాత్రలు పోషించారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com